J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 నెల్లూరు, 28.02.2020, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 39 పేజీలు : 12, వెల : ₹ 5




లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

- కలిసి నడుస్తాం... ప్రపంచాన్ని నడుపుతాం...
- భారత్ - అమెరికా సంబంధాలలో నూతన అధ్యాయం
- ప్రజాస్వామ్య అగ్రదేశాల అరుదైన సందేశం



# స్నేహమంటే ఇదేరా!

## దేశాలు వేరైనా దేహం ఒక్కటే

**ఒకరు ప్రపంచానికి పెద్దన్న... ఇంకొకరు ప్రజాస్వామ్యానికి పెద్దన్న... రెండు దేశాల దారులు ఒక్కటే... రెండు దేశాల గమ్యం ఒక్కటే... ఆ రెండు దేశాలు ఒక్కటై నడిస్తే... ఆ జోడీని ఢీకొట్టేదెవరు? పడగొట్టేదెవరు?**

ప్రపంచ అగ్రరాజ్యం అమెరికా, ప్రజాస్వామ్య అగ్రదేశం భారత్‌ల మధ్య స్నేహవృక్షం విత్తనం దశ నుండి మొలక స్థాయిని దాటి మహావృక్షం స్థాయికి చేరింది. ఇరు దేశాల మధ్య స్నేహ వారధి నిర్మాణం పటిష్టంగా జరుగుతోంది. భారత్‌కు చేరువకావాలనే అమెరికా ఆకాంక్ష... అమెరికాతో స్నేహ సంబంధాలను పెంచుకోవాలనే భారత్ ధృడాభిప్రాయం.. వెరసి ఇరు దేశాల మధ్య మైత్రి పతాక స్థాయికి చేరింది.

అమెరికా, భారత్ మైత్రిని మరింత ధృఢంగా మలుస్తూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన రెండురోజుల భారత పర్యటన దిగ్విజయమైంది.

ప్రపంచంలో ఏ దేశాధినేత అయినా భారత పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తారు. ఈ దేశంలో పర్యటన కేవలం వర్తక, వాణిజ్య, రక్షణ ఒప్పందాలకు పరిమితమై వుండదు. భారతదేశానికి రావడమంటే ఆత్మబంధువుల ఇంటికి వచ్చినట్లే! ఆర్థిక సంబంధాలకంటే ఆత్మీయ సంబంధాలు భారత్‌లో జరిపే పర్యటనలలో ప్రతిబింబిస్తుంటాయి.

డొనాల్డ్ ట్రంప్ రెండురోజుల భారత పర్యటన కూడా పూర్తిగా అదే కోణంలో జరిగింది. ఈ నెల 24వ తేదీన భార్య మెలానియా, కూతురు ఇవాంకా, ఇతర కుటుంబసభ్యులతో కలిసి భారత్‌లో అడుగుపెట్టిన ట్రంప్‌కు భారతావని ఆత్మీయస్వాగతం పలికింది. మొదట అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టులో ఏ-1 విమానం ల్యాండ్ కావడం, అక్కడ భారత ప్రధాని మోడీ స్వయంగా గుజరాత్ సంప్రదాయ రీతుల మధ్య ట్రంప్ దంపతులకు స్వాగతం పలకడం జరిగింది. తన జీవితంలో తొలిసారిగా పూజ్య బాపూజీ సబర్మతి ఆశ్రమాన్ని సందర్శించిన ట్రంప్, ఆశ్రమాన్ని (మిగతా 11వ పేజీలో)

'సిట్'తో... 'దేశం' నేతల్లో హీట్ 3లో




## లాయర్ ఆహ్వానము

'లాయర్' వారపత్రిక ఆధ్వర్యంలో
"అంతర్జాతీయ మహిళా దినోత్సవం"
మార్చి 8, 2020 ఆదివారం ఉదయం 10గంటలకు
నెల్లూరు - గొలగమూడిరోడ్డులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగును.

ఈ సందర్భంగా
భారత ఉపరాష్ట్రపతి గారి సతీమణి
**శ్రీమతి ఉషా వెంకయ్యనాయుడు గారికి**
గౌరవ సత్కారం జరుగును.

ఈ కార్యక్రమానికి
ప్రముఖ వ్యాపారవేత్త, సామాజిక సేవకురాలు
**శ్రీమతి గునుపాటి పింకిరెడ్డి గారు**
అధ్యక్షత వహిస్తారు.

తిరుమల తిరుపతి దేవస్థానముల పాలకమండలి సభ్యురాలు
**శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గారు**
జ్యోతిప్రజ్వలన గావిస్తారు.

ఈ మహోత్సవంలో
**శ్రీమతి అల్లారెడ్డి నీనరెడ్డి గారు**
జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, 'సవేరా' గ్రూప్ ఆఫ్ హోటల్స్
**శ్రీమతి ఇమ్మణ్ణి దీపావెంకట్ గారు**
మేనేజింగ్ ట్రస్టీ, స్వర్ణభారత్ ట్రస్ట్
**శ్రీమతి యస్.పి.శైలజ గారు**
ప్రముఖ సినీ గాయనీమణి
**శ్రీమతి నూకలపాటి పార్వతిరెడ్డి గారు**
ప్రముఖ వ్యాపారవేత్త
ముఖ్యఅతిథులుగా పాల్గొంటారు.

ఈ వేడుకలో
లాయర్
వారపత్రిక ప్రచురించిన
'సింహపురికి వన్నెతెచ్చిన వనితలు'
ప్రత్యేక సంచిక ఆవిష్కరించబడును.

అందరూ ఆహ్వానితులే!




# ఆ ఇళ్ళు... పిచ్చుక గూళ్లేనా?

## లబ్దిదారులకు చేరని ఎన్టీఆర్ ఇళ్ళు
## ప్రారంభానికి ముందే పగుళ్ళు
## డబ్బులు కట్టి లబోదిబోమంటున్న బాధితులు

*పట్టణ పేదలకు నీడ, గూడు కల్పించాలనే ఆశయంతో కేంద్ర ప్రభుత్వం గృహ సముదాయాల నిర్మాణానికి పూనుకోవడం తెలిసిందే! కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లకు గత తెలుగుదేశం ప్రభుత్వంలో చంద్రబాబు తన ట్యాగ్‌లైన్‌ను తగిలించుకుని, వాటికి 'ఎన్టీఆర్ ఇళ్ళు' అని నామకరణం చేయడం తెలిసిందే!*

నెల్లూరుజిల్లాకు వస్తే, నెల్లూరు నగరంతో పాటు కావలి, గూడూరు, నాయుడుపేట, ఆత్మకూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి పట్టణాలలో పెద్దఎత్తున ఎన్టీఆర్ ఇళ్ళు నిర్మించారు. అప్పట్లో ఎల్ అండ్ టి, షాపుంజి, మెగా వంటి కంపెనీలకు ఈ ఇళ్ళ నిర్మాణం అప్పగించారు. అప్పటి మున్సిపల్ మంత్రిగా వున్న పి.నారాయణ ఇళ్ళ నిర్మాణాన్ని పర్యవేక్షించారు. ఇళ్ళ నిర్మాణంలో షీర్‌వాల్ టెక్నాలజీని ప్రవేశ పెట్టినట్లు ఘనంగా చెప్పుకున్నారు. ఇళ్ళకు లబ్దిదారులను ఎంపిక చేసి వారి నుండి డబ్బులు కూడా కట్టించుకున్నారు. ఇళ్ళ పేరుతో తెలుగుదేశం నాయకులు అప్పట్లో పెద్ద షోలు చేశారు. గృహ ప్రవేశాలని ఒకసారి, లబ్దిదారులకు ఇళ్ళ కేటాయించడానికి లాటరీ అని ఇంకోసారి ప్రచారార్భాటం చేసిపెట్టారు. కాని లబ్దిదారులకు మాత్రం ఇళ్లను కేటాయించలేదు.

అయితే ఎన్నికల ప్రచారంలోనే వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్టీఆర్ ఇళ్ళకు రూపాయి కట్టబల్లేదని, తాము అధికారంలోకి వస్తే ఉచితంగా ఇస్తామని హామీ ఇవ్వడం జరిగింది. వైసిపి అధికారంలోకి వచ్చి 9నెలలవుతోంది. ఎన్టీఆర్ ఇళ్ళ కేటాయింపుపై ఇంతవరకు నిర్ణయం తీసుకోలేదు.




## సింహపురి సమాచారం

తెలుగుదేశం ప్రభుత్వంలో నాసిరకంగా ఇళ్ళ నిర్మాణం జరిగింది. నాణ్యత లేని వస్తువులు వాడారు. దీనికితోడు మూడు, నాలుగు అంతస్తులుగా గృహ సముదాయాలు నిర్మించినా లిఫ్ట్‌లు ఏర్పాటు చేయలేదు. పై అంతస్థుల్లో ఫ్లాట్లు వచ్చిన లబ్దిదారులకు అగచాట్లు తప్పవు. వైసిపి నాయకులు మాత్రం లిఫ్ట్‌లు ఏర్పాటు చేసి ఫ్లాట్లు ఇస్తామన్నారు. అయితే ఇంతవరకు ఫ్లాట్లు ఇవ్వకపోవడం, లబ్దిదారులు చేరకపోవడంతో ఈ గృహ సముదాయాలు ప్రారంభానికి ముందే శిథిలావస్థకు చేరుతున్నాయి. వీటికి సరైన రక్షణ లేక వీటిలో ఏర్పాటు చేసిన కరెంట్ వైర్లు, ఇతర గృహోపకరణాలు చోరీకి గురవుతున్నాయి. వీటిపై త్వరగా నిర్ణయం తీసుకోకపోతే ఇవి కూడా రాజీవ్‌గృహకల్ప ఇళ్ళులాగానే తయారవుతాయి.

### కార్మికులకు
## ఉద్యోగ భద్రత కల్పించాలి

కృష్ణపట్నం పోర్టులో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని నెల్లూరుజిల్లా కృష్ణపట్నం పోర్టు కార్మికులు, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 24న నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్ నుంచి ప్రదర్శనగా కలెక్టరేట్ వద్దకు వచ్చి అక్కడ ధర్నా నిర్వహించారు. కార్మికులందర్నీ నూతన యాజమాన్యం యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ధర్నా సందర్భంగా పోలీసులకు ఆందోళనకారులకు కొంతసేపు వాగ్వాదం జరిగింది. కొందరు నాయకులు, పోలీసు సిబ్బంది జోక్యం చేసుకోవడంతో పరిస్థితి చక్కబడింది. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్, కృష్ణపట్నం పోర్టు కార్యదర్శి గోగుల శ్రీనివాసులు, అధ్యక్షులు గడ్డం అంజయ్య, జిల్లా కార్యదర్శి అల్లాడి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### క్షణికావేశం
## ప్రాణాలు తీసింది

భార్యాభర్తల మధ్య చిన్నపాటి కలహం, ఓ తల్లి క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం ముక్కుపచ్చలారని ఇద్దరు చిన్నారుల జీవితాలను చిదిమేసింది. తర్వాత తనూ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. నెల్లూరుజిల్లా కోట మండలంలోని ఊసుగుంటపాళెం గిరిజన కాలనీకి చెందిన రాణి(23), గుండాలమ్మపాళెంకు చెందిన నాగార్జున భార్యాభర్తలు. నాగార్జున నెల్లూరులోని ఓ హోటల్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. వీరికి సందీప్(5), సుధీర్(2) మగపిల్లలు. రాణి నెల్లూరులో కాపురం పెట్టాలని భర్త నాగార్జునను కొంతకాలంగా ఒత్తిడి చేస్తున్నది. ఇందుకు నాగార్జున నిరాకరించడంతో రాణి పుట్టింటికి వెళ్ళింది. ఈనెల 21న రాణి తల్లిదండ్రులు పని మీద బయటకు వెళ్ళడంతో తన ఇరువురు పిల్లలను చంపి, తాను ఉరేసుకుని మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడకు వెళ్లారు. రాణి తల్లిదండ్రుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు వాకాడు సిఐ నరశింహారావు తెలిపారు.

# ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన రత్నమ్మ



నెల్లూరుజిల్లా అడ్మిన్ ఏఎస్పీగా వి.వెంకటరత్నమ్మ ఈ నెల 26వ తేదీన నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం సిఐడి విభాగంలో డిఎస్పీగా పనిచేస్తున్న ఆమె పదోన్నతి మీద ఇక్కడకు బదిలీ కావడం తెలిసిందే! నూతన ఏఎస్పీగా వచ్చిన వెంకటరత్నమ్మను నగర, రూరల్ డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలు, జిల్లా పోలీసు అధికారుల సంఘం నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏఎస్పీగా నెల్లూరుకు రావడం ఆనందంగా వుందని, తన బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహిస్తానని, పోలీసు సంక్షేమానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

### ప్రత్యేక రాష్ట్రంతోనే...


# రాయలసీమకు మంచిరోజులు

**- గంగుల ప్రతాప్‌రెడ్డి**



గ్రేటర్ రాయలసీమ ప్రత్యేక రాష్ట్రంతోనే రాయలసీమ అభివృద్ధి చెందగలదని కర్నూలు మాజీ ఎంపీ గంగుల ప్రతాప్ రెడ్డి పేర్కొన్నాడు. 26వతేదీ నెల్లూరులోని హోటల్ డి.ఆర్ ఉత్తమలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణ దేవ రాయల పాలన నుండి ఒకే ప్రాంతంగా వున్న కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు మరియు ప్రకాశం జిల్లాలతో కలిపి గ్రేటర్ రాయలసీమ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 1937లో జరిగిన శ్రీభాగ్ ఒడంబడిక నుండి నేటి మూడు రాజధానుల ప్రకటన వరకు రాయలసీమకు ప్రతి ప్రభుత్వం అన్యాయం చేస్తూనే వుంది. ఉమ్మడి రాష్ట్రంలోనూ, ప్రత్యేక రాష్ట్రంలోనూ రాయలసీమ రాత మారలేదు. కర్నూలు రాజధానిని కోల్పోయాం, కృష్ణా, పెన్నా నదులు పక్కనే ప్రవహిస్తున్నా సాగునీటికి, తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం, ఈ రాష్ట్రాన్ని ఏలిన ముఖ్యమంత్రులలో ఎక్కువ మంది రాయలసీమవాళ్ళే! అయినా ఏం లాభం, రాయలసీమ ప్రజల సామాజిక, ఆర్ధిక స్థితిగతులలో ఏ మాత్రం మార్పులు లేవని ఆయన అన్నాడు. గ్రేటర్ రాయలసీమ సాధన ఉద్యమంలో నెల్లూరుజిల్లాకు చెందిన నాయకులు, మేధావులు, విద్యార్థులు రాజకీయాలకతీతంగా భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చాడు. గ్రేటర్ రాయలసీమ ఉద్యమంతోనే ప్రత్యేకరాష్ట్రం వస్తుందని, ఈ ఆరు జిల్లాల అభివృద్ధికి పునాది పడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో హోటల్ డి.ఆర్ ఉత్తమ అధినేత కొడవలూరు దీపక్‌రెడ్డి, ఆప్ నాయకులు బసిరెడ్డి నారాయణరెడ్డి, గ్రేటర్ రాయలసీమ ఉద్యమ నాయకులు పాల్గొన్నారు.

# 'సిట్'తో 'దేశం' నేతల్లో హీట్



**పార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ చంద్రబాబునాయుడు తన రాజకీయ జీవితంలో కొమ్ములు తిరిగిన నాయకులనెందరినో ఎదుర్కొన్నాడు. గెలుపోటములు చూశాడు. కోట్ల విజయభాస్కర్‌రెడ్డిని మొదలుకొని వైయస్ రాజశేఖరరెడ్డి దాకా ఎంతో మందితో తలపడ్డాడు. క్రిందామీదా పడ్డాడు. కాని వైయస్ జగన్మోహన్‌రెడ్డి అనే ఒక యువనాయకుడు వస్తాడని, అతను తనను ముప్పు తిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తాడని కలలో కూడా వూహించి వుండడు. ఆ వూహించనిదే ఇప్పుడు నిజమవుతోంది.**



చంద్రబాబు తన రాజకీయ జీవితంలో ఇప్పటివరకు ఎదుర్కొన్న ప్రత్యర్థులు ఒకెత్తు, ఇప్పుడు ఎదుర్కొంటున్న ప్రత్యర్థి మరో ఎత్తు. తన కుయుక్తులతో ఎందరి రాజకీయ జీవితాలకో సమాధి కట్టిన చంద్రబాబుకే చుక్కలు చూపిస్తూ చెమటలు కక్కిస్తున్నాడు వైయస్ జగన్మోహన్‌రెడ్డి. చంద్రబాబు గతంలో పదేళ్ళ ప్రతిపక్షంలో వున్నాడు. అంతకుముందు 9ఏళ్ళ ముఖ్యమంత్రిగా చేసినప్పటికీ ఆయన తర్వాత ముఖ్యమంత్రులుగా వచ్చినవాళ్ళు చంద్రబాబు గతంలో చేసిన అవినీతి పాపాలపై దృష్టి పెట్టలేదు. స్వర్గీయ వైయస్ రాజశేఖరరెడ్డి సైతం ఆయనను ఒక చూపు చూడాలను కోకుండా వదిలేశాడు.

ఇప్పుడు జగన్ అలాకాదు, చంద్రబాబు అవినీతి పాపాలను వెలికి తీయడంలో రాజీలేని మార్గంలో పోతున్నాడు. చంద్రబాబు గత ఐదేళ్ల పాలనలో అవినీతి, అక్రమాల నిలువెత్తు సాక్ష్యం అమరావతి రాజధాని. చంద్రబాబు అవినీతిగని ఇది. 2014లో అధికారంలోకి వచ్చీరాగానే 'రాజధాని'ని పెద్ద మార్కెటింగ్ కోణంలో ఆలోచించాడు. హైదరాబాద్‌లో మాదాపూర్ తరహాలో రియల్‌ఎస్టేట్ ప్లాన్ చేశాడు. ప్రభుత్వ నిర్ణయాలను రహస్యంగా వుంచాల్సినప్పటికీ, అమరావతి కేంద్రంగా రాజధానిని ఏర్పాటు చేస్తున్నట్లు లీకులను అనుయాయులకు ముందే వదిలేశాడు. ఇంకేముంది అప్పట్లో పచ్చదండు గద్దల్లా అమరావతి భూములపై పడింది. ఇన్‌సైడర్ ట్రేడింగ్ వేల ఎకరాలలో జరిగిపోయింది. తెలుగుదేశం పార్టీకి చెందిన బడా నేతలు, పారిశ్రామికవేత్తలు, రియల్టర్లంతా కూడా భారీఎత్తున పట్టాభూములే కాక, అసైన్డ్ భూములను కూడా కారు చౌకగా కొన్నారు. కొందరైతే అసలు భూములు లేకుండానే భూములు వున్నట్లు నకిలీ పాస్ పుస్తకాలు సృష్టించి, వాటిని ప్రభుత్వానికి ధారాదత్తం చేసినట్లు సృష్టించి సిఆర్‌డిఎలో ప్లాట్లు కొట్టేశారు. అవినీతి, అక్రమాలు ఎన్ని రకాలుగా చేయొచ్చో అవన్నీ అమరావతి రాజధాని విషయంలో జరిగిపోయాయి.

ఇప్పుడు ఆ అవినీతి అక్రమాలను బయటపెట్టేదానికే ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి పచ్చజెండా ఊపాడు. రాజధానిని అమరావతి నుండి విశాఖపట్నంకు మార్చడంతోనే చంద్రబాబు బృందానికి నడుములు విరిగినట్లయ్యింది. ఇన్‌సైడర్ ట్రేడింగ్‌లో అక్కడ భూములు కొన్నోళ్లంతా రైతుల వేషంలో రోజూ ధర్నాలు చేయడం చూస్తూనేవున్నాం. అమరావతిలోనే రాజధాని ఉండాలంటూ ఆందోళనలు చేయాల్సిన అవసరం రైతులకైతే లేదు. ఎందుకంటే చాలామంది రైతులు తమ పొలాలు అమ్మేసుకున్నారు. పొలాలు అమ్ముకుండా వుంచుకున్న రైతులకు ఆందోళనలు చేయాల్సిన అవసరం లేదు. ఎందుకంటే వాళ్ళు నష్టపోయేదేమీ లేదుకాబట్టి. అక్కడ ఆందోళనలు చేస్తున్నదల్లా మాదాపూర్ లెవల్లో స్థలాల రేట్లు పెరుగుతాయనే ఆశతో రైతుల నుండి తక్కువ ధరకు పొలాలు కొన్నవాళ్లే!

రాజధాని పోయి వీళ్ళు ఏడుస్తుంటే, ఇప్పుడు సిఆర్‌డిఏ అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం ఇంటలిజన్స్ ఐజి కొల్లి రఘురామిరెడ్డి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు (సిట్) బృందాన్ని నియమించడం చంద్రబాబు బృందానికి గోరుచుట్టుపై రోకటి పోటులా పరిణమించింది. సిఆర్ డిఏలో జరిగిన అక్రమాలపై గతంలో మంత్రివర్గ సబ్‌కమిటీయే నివేదికలిచ్చింది. ఇప్పుడు 'సిట్' సిఆర్‌డిఏలో తవ్వకాలు మొదలుపెడితే ఎన్నెన్ని పాపాల శకలాలు బయటపడతాయో... జగన్ 'సిట్' అనేసరికి 'దేశం' వర్గాలలో భయం తాలూకు హీట్ పెరిగింది.

# ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తిలో శ్రీసిటీ భేష్

**- ఈఎస్ఎస్‌సిఐ సిఇఓ మహాపాత్ర**



ఎలక్ట్రానిక్స్ సెక్టార్ స్కిల్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఈఎస్ఎస్‌సీఐ) సీఈఓ మహాపాత్ర ఈ నెల 25న శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు.

ఈ సందర్భంగా మహాపాత్ర ఎంతో ఆసక్తితో శ్రీసిటీ గురించి పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకించి ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ (ఈఎంసీ)లో భాగంగా ఇక్కడ ఏర్పాటైన ఎలక్ట్రానిక్ సెక్టార్ పరిశ్రమల గురించి తెలుసుకున్నారు. అనంతరం పారిశ్రామికవాడ పరిసరాలను చుట్టిచూడడంతో పాటు శ్రీసిటీలోని చైనా ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ గ్రూప్ కార్పొరేషన్ అనుబంధ సీఈటీసీ (ఇండియా) పరిశ్రమను సందర్శించారు. శ్రీసిటీ ప్రపంచశ్రేణి మౌలిక వసతుల పట్ల ఆకర్షితులైన ఆయన, సువిశాల పారిశ్రామికవాడ ఏర్పాటుతో పాటు వేలాది ఉద్యోగాలు రావడానికి కృషిచేసిన శ్రీసిటీ యాజమాన్యాన్ని అభినందించారు. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు శ్రీసిటీ ఈఎంసీలోని ఎలక్ట్రానిక్ క్లస్టర్ లో వ్యాపార అవకాశాలను అంచనా వేయడమే తమ పర్యటన ప్రధాన ఉద్దేశ్యంగా మహాపాత్ర తెలిపారు. ఈ పర్యటనలో ఆయనతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. మహాపాత్ర పర్యటన తమకెంతో ముఖ్యమైనదంటూ శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి వ్యాఖ్యానించారు. ఆయన పరిశీలనలు, సూచనలు, సలహాలు శ్రీసిటీ మరింత అభివృద్ధికి ప్రయోజనం చేకూరుస్తాయన్నారు.

# సీఎం దృష్టికి తీసుకెళ్తా!

**- ముస్లింలకు ఆదాల హామీ**

సిఏఏ, ఎన్ఆర్‌సి, ఎన్‌పిఆర్ బిల్లుల విషయంలో ముస్లిం వ్యతిరేక వైఖరిని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 25వ తేదీన ముస్లిం మైనార్టీ జేఏసీ ఆధ్వర్యంలో ముస్లిం నాయకులు సిఏఏ, ఎన్ఆర్‌సి, ఎన్‌పిఆర్ బిల్లులకు వ్యతిరేకంగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆదాల, వారితో మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో హిందూ ముస్లింలు ఎంతో ఐక్యమత్యంగా జీవిస్తారని, ఈ సమైక్యత చిరకాలం వర్ధిల్లాలని, వారి మధ్య మనస్పర్ధలకు తావులేదని అన్నారు. ఈ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టినప్పుడు తాను లేనని, ఈ బిల్లు విషయమై ముఖ్యమంత్రితో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు మౌలానా



ఇలియాజ్, ఆసిఫ్, జాకీర్, ఫయాజ్, జియావుల్‌హక్, షకీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదాలను కలిసిన మేకపాటి



ఉదయగిరి శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఈనెల 25వ తేదీన నెల్లూరు పార్లమెంట్ సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా మేకపాటి ఉదయగిరి నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆదాల దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలోను, అలాగే కేంద్రప్రభుత్వ స్థాయిలోనూ తాము మనసుపెట్టి పరిష్కరించగల సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా ఆదాల హామీ ఇచ్చాడు.

## 'ప్రభా'తం

# బంధం బలోపేతం



ఇరు దేశాల మధ్య మైత్రి బంధాన్ని పటిష్టం చేసే దిశగా ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పర్యటన ఎంతగానో దోహదపడుతోంది. గత కొన్నేళ్లుగా భారత్ - అమెరికాల మధ్యే కాదు, వాటి అధినేతలు నరేంద్ర మోడీ - డోనాల్డ్ ట్రంప్‌ల మధ్య సైతం వ్యక్తిగత స్నేహం బలంగా వుంది. గత ఏడాది నరేంద్ర మోడీ అమెరికాలో పర్యటించినప్పుడు ఆ దేశం ఇచ్చిన గౌరవం మరచిపోలేనిది. ఇప్పుడు ట్రంప్‌ను కూడా భారతదేశం అదే రీతిలో స్వాగతించి సత్కరించింది.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ఈ 72ఏళ్ల స్వతంత్ర పాలనను రెండు కోణాలుగా విభజించుకోవచ్చు. ముఖ్యంగా ఈ 72ఏళ్లలో భారత విదేశాంగ విధానాన్ని రెండు రకాలుగా చెప్పుకోవచ్చు. మొదటిది ఏంటంటే 'అందరికీ దూరంగా...' ఇది మాజీప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అనుసరించిన విధానం. భారతదేశంలో ఇప్పుడున్న పలు సమస్యలకు కారణం ఆనాడు నెహ్రూ అవలంభించిన విధానాలేనని చెప్పవచ్చు. ఇందులో ప్రధానంగా గుర్తుంచుకోదగ్గది జమ్ము-కాశ్మీర్ వివాదమైతే, అంతర్జాతీయ స్థాయిలో చెప్పాల్సింది అలీనోద్యమం. నానాజాతి సమితి, ఆ తర్వాత ఐక్యరాజ్య సమితిల ఏర్పాటు సమయంలో ఆయన 'అలీన'బాట పట్టారు. మేము ఎవరికీ మద్దతుగా వుండము, ఎవరితోనూ ఉండము అని చెప్పే ఉద్దేశ్యం.

అలాగని ఆ సమయంలో అందరికీ సమాన దూరంలో వున్నామా అంటే అదీ లేదు. రష్యాతో మిత్రదేశంగా వుంటూ అమెరికాతో సహా పలు దేశాలను శత్రుదేశాలుగా మార్చుకున్నారు. రష్యాతో మనం స్నేహంగా మెలిగినప్పటికి, అమెరికాతో శత్రుత్వం తెచ్చుకోవాల్సిన అవసరం లేదు. కాని నెహ్రూ అవలంభించిన కొన్ని విధానాల వల్ల దాదాపు అర శతాబ్దం పాటు అమెరికాతో సహా పలు దేశాలు చాలా దూరంగా వుండేవి.

నెహ్రూ అవలంభించిన అందరికీ దూరంగా, అనే అలీన విధానానికి తెరదించుతూ 21వ శతాబ్దం ప్రారంభంలో అప్పటి ప్రధానిగా వున్న అటల్ బిహారీ వాజ్‌పేయి 'అందరితో మేము' అన్న సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టాడు. దాదాపు 3 దశాబ్దాల తర్వాత అమెరికా అధ్యక్షుడు ఇండియాలో అడుగు పెట్టాడు. అప్పట్లో అమెరికా అధ్యక్షుడిగా వున్న బిల్‌క్లింటన్ భారత పర్యటనకు రావడం, ఆ పర్యటనతోనే భారత్ - అమెరికాల మధ్య సరికొత్త స్నేహ సంబంధాలకు పునాది పడటం తెలిసిందే! భారత్ మీద వ్యతిరేకతతో అప్పటివరకు పాకిస్థాన్‌కు అమెరికా మద్దతుగా వుండేది. అమెరికా నుండి అందిన ఆర్థిక, ఆయుధ సహకారంతోనే పాకిస్థాన్ భారతదేశంలో ఉగ్రచర్యలకు పాల్పడుతూ వచ్చింది.

తమకు భారతదేశం దగ్గరయ్యాకే అమెరికా, పాకిస్థాన్‌ను దూరం పెడుతూ వచ్చింది. బిల్‌క్లింటన్ తర్వాత అమెరికా అధ్యక్షులుగా వచ్చిన జార్జి బుష్ గాని, బరాక్ ఒబామా గాని భారత్‌లో పర్యటించడం ద్వారా, వాజ్‌పేయి, క్లింటన్‌లు వేసిన ఇరుదేశాల స్నేహ సంబంధాలను కొనసాగించారు.

అంతేకాదు, గత దశాబ్దకాలంలో చోటుచేసుకున్న పరిణామాలు కూడా అమెరికాకు భారత ప్రాధాన్యతను తెలియజెప్పాయి. న్యూయార్క్‌లో వరల్డ్ ట్రేడ్ సెంటర్ భవనాలను ఆల్‌ఖైదా ఉగ్రవాదులు విమానాలతో నేలమట్టం చేసి అమెరికాకే సవాల్ విసరడం, వాటి కూల్చివేత సూత్రధారి, ఆల్‌ఖైదా అధినేత ఒసామా బిన్‌లాడెన్ పాకిస్థాన్‌లో ఆశ్రయం పొందుతూ అమెరికా సైనికుల చేతుల్లో చావడం, అమెరికాను ఎదిరిస్తూ, ఆ దేశానికి అన్ని విధాలా పోటీదారుగా ఎదుగుతున్న చైనాకు పాకిస్థాన్ దాసోహం కావడం వంటి అంశాలన్నీ భారత్ పట్ల అమెరికా వైఖరిని మార్చుకునేలా చేశాయి. భారత్‌తో స్నేహ సంబంధాలు మెరుగుపరుచుకునే దిశగా పురికొల్పాయి.

గత కొన్నేళ్లుగా ఎన్నో అంతర్జాతీయ వేదికలపై భారత్ చేస్తున్న ఉగ్రవాద వ్యతిరేక పోరాటాలకు అమెరికా వెన్నుదన్నుగా నిలిచింది. అన్ని అంశాలలోనూ భారత్‌కు మద్దతునిస్తోంది. భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించే విషయంలో కూడా అమెరికా తన సహకారాన్ని అందిస్తోంది. గత ఇరవై ఏళ్లలో అమెరికాతో భారత్ మైత్రి ఎంతగానో బలపడింది. అంత మాత్రాన రష్యా మనకు దూరం కాలేదు. ఒక్క పాకిస్థాన్ తప్ప ఇంకే దేశం మనల్ని శత్రువుగా చూడడం లేదు.

ఇరు దేశాల మధ్య మైత్రి బంధాన్ని పటిష్టం చేసే దిశగా ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పర్యటన ఎంతగానో దోహదపడుతోంది. గత కొన్నేళ్లుగా భారత్ - అమెరికాల మధ్యే కాదు, వాటి అధినేతలు నరేంద్ర మోడీ - డోనాల్డ్ ట్రంప్‌ల మధ్య సైతం వ్యక్తిగత స్నేహం బలంగా వుంది. గత ఏడాది నరేంద్ర మోడీ అమెరికాలో పర్యటించినప్పుడు ఆ దేశం ఇచ్చిన గౌరవం మరచిపోలేనిది. ఇప్పుడు ట్రంప్‌ను కూడా భారతదేశం అదే రీతిలో స్వాగతించి సత్కరించింది. ఇరు దేశాల మధ్య, వాణిజ్య, రక్షణ సంబంధాలు మరింత బలపడే దిశగా పలు ఒప్పందాలు జరిగాయి. ట్రంప్ భారత పర్యటన ఫలప్రదమైంది. భారత్‌తో స్నేహం అమెరికాకు ఎంత అవసరమో, అంతర్జాతీయ సమాజంలో అమెరికా మద్దతు కూడా మనకు అంతే అవసరం. ఈరోజు భారతీయులు భారత్ తర్వాత అత్యధికంగా ఉపాధి పొందుతూ నివసిస్తుందేది అమెరికాలోనే! కాబట్టి మనకు రెండో ఇండియా అమెరికా! ఆ దేశంతో సంబంధాలు ఎప్పటికీ వాంఛనీయమే!

ట్రంప్ రెండు రోజుల పర్యటన ఈ బంధాన్ని మరింత ముందుకు తీసుకువెళ్ళే దిశగా సాగింది. ముఖ్యంగా అహ్మదాబాద్‌లోని మొతెరా స్టేడియంలో లక్షలాది మంది భారతీయులనుద్దేసిస్తూ ట్రంప్ చేసిన ప్రసంగం భారత్ పట్ల అమెరికా ఎటువంటి ప్రేమపూర్వక వైఖరిని చూపిస్తుందనేందుకు అద్దం పట్టింది. ఈ ప్రేమ వెనుక అతిపెద్ద భారత్ మార్కెట్ కూడా ఒక కారణమై ఉండొచ్చు. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో అమెరికాతో స్నేహం మనకు ఎంతో అవసరం కూడా!

## రైతులకు మద్దతు ధర లభించాలి

జిల్లాలో రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర లభించేలా చూడాలని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మిడతల రమేష్ ఈనెల 23న జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. నెల్లూరులోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబును వారు కలసి ఆమేరకు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించక పోవడంతో రైతులు అవస్తలు పడుతున్నారని, వెంటనే రైతులను అన్నివిధాలా ఆదుకోవాలని వారు కోరారు.

## ఆదిత్య విద్యాసంస్థల వార్షికోత్సవం



సత్కారాన్నందుకుంటున్న విసి సుదర్శనరావు

నెల్లూరు ఆదిత్యనగర్‌లో ఉన్న ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల 21వ వార్షికోత్సవం ఈనెల 23న ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న విఎస్‌యు వైస్‌చాన్సలర్ ఆచార్య ఆర్.సుదర్శన రావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణతో రాణించాలని, సామాజిక పరిజ్ఞానం, సేవాభావం కలిగివుండాలని అన్నారు. దేశానికి ఎనలేని సేవలందించిన అబ్దుల్‌కలాం జీవిత చరిత్రను అందరూ చదవాలని, ఆ మహనీయుని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ అవార్డులు సాధించిన విద్యార్థులకు, యూనివర్సిటీ స్థాయిలో ఉత్తమఫలితాలు సాధించిన వారికి వీసీ చేతుల మీదుగా బహుమతులందజేశారు. కళాశాల కరెస్పాండెంట్ ఆచార్య ఆదిత్య, కళాశాల ప్రిన్సిపాల్ డి.పుల్లయ్య, డైరెక్టర్ కృష్ణారెడ్డి, వైస్‌ప్రెసిడెంట్ వెంకటరెడ్డి, అకాడమీ డైరెక్టర్ యమునా ప్రియదర్శిని, అభ్యాస్ అకాడమీ డైరెక్టర్ విక్రమ్, వ్యవసాయ అధికారి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

### వాసవిమాతకు
## కుంకుమ పూజలు

నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో వేంచేసి యున్న ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవస్థానంలో ఈనెల 22 న మహిళలు సామూహిక కుంకుమ పూజలు వైభవంగా నిర్వహించారు. అర్బన్ ఆర్యవైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం పాల్గొన్న భక్తులకు డ్రా నిర్వహించి 8మంది మహిళలకు ఒడిబియ్యం అందించారు. అర్బన్ ఆర్యవైశ్య మహిళా విభాగం అధ్యక్షురాలు పిండి వెంకట లక్ష్మీ, ప్రాజెక్ట్ చైర్మన్ గుండ్లపల్లి మహిత పర్యవేక్షించారు.

### సుందరేశ్వరస్వామికి
## ప్రత్యేకపూజలు

శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల23న నెల్లూరులోని శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో కొలువై ఉన్న సుందరేశ్వరస్వామికి పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, రుద్రహోమాలు తదితర కార్యక్రమాలను ఎంతో భక్తిశ్రద్ధలతో చేపట్టారు. అనంతరం పూర్ణాహుతి, త్రిశూలస్నానం, మధ్యాహ్న నివేదనలు చేసి రాత్రికి ధ్వజావరోహణం, అశ్వవాహనసేవ నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.




## ఉరితీయాలి

ఒక ఇంట్లో తిండి తింటూ పక్కింటికి కాపలకాసే కుక్కనే మనం తన్ని తరిమేస్తాం... అలాంటిది ఈ దేశంలో తిండి తింటూ పక్కదేశాలకు జేజేలు కొట్టే తోడేళ్లను ఏం చేయాలి...? కాల్చిపడేయాలి. బెంగుళూరులో రాజ్యాంగ పరి రక్షణ వేదిక పేరుతో ఏర్పాటు చేసిన సభలో 'అమూల్య' అనే పిచ్చికుక్క 'పాకిస్థాన్ జిందాబాద్' అంటూ నినాదాలు చేసింది. దీనికి సభకు వచ్చినవాళ్ళు కూడా హర్షధ్వానాలు చేశారు. దీనినిబట్టి చూస్తే ఎంతమంది ఇక్కడి తిండి తింటూ పాకిస్థాన్ పట్ల భక్తిని చూపిస్తున్నారో తెలుస్తోంది. ఇలాంటి దేశ ద్రోహులను మేపాల్సిన అవసరం లేదు. వీళ్లంతా భూమికి భారమే! ఇలాంటివాళ్ళను దేశ ద్రోహం నేరం క్రింద కఠినంగా శిక్షించాలి. **– సి.రాజీవి, నెల్లూరు.**

## అవినీతిని మట్టుబెట్టాల్సిందే!

గత తెలుగుదేశం ప్రభుత్వంలో చోటుచేసుకున్న అవినీతి అక్రమాలపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం 'సిట్'ను నియమించడం అభినందనీయం. ఇదొక మంచి సాంప్రదాయం కూడా! అయితే ఈ విచారణ పర్వం అన్నది కక్షలు, పగలు తీర్చుకోవాలనే కోణంలో కాకుండా, అవినీతి, అక్రమాలను అరికట్టే సాంప్రదాయంగా వుండాలి. గత ఐదేళ్ల తెలుగుదేశం పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలకు అంతూపొంతూ లేదు. పోలవరం ప్రాజెక్ట్, అమరావతి రాజధాని, పుష్కరాలు, కాంట్రాక్టులు, పథకాలు... అన్నీ అవినీతిమయమే! వంద రూపాయలయ్యే పనికి ఐదొందల నుండి వెయ్యి రూపాయల దాకా కేటాయించి ప్రజల సొమ్ము స్వాహా చేశారు. వీటిపై విచారణ జరిపితే ఎన్ని బొక్కలు బయటపడతాయో?

**మల్లెపు సతీష్, కొండారెడ్డిపల్లి.**

## భూగర్భ డ్రైనేజీ పరిస్థితేంటి?

తెలుగుదేశం ప్రభుత్వంలో నెల్లూరు నగరంలో భూగర్భ డ్రైనేజీ, మంచినీటి పైపులైన్ల పనులు చేపట్టారు. నగరంలో వున్న రోడ్లన్నింటినీ ధ్వంసం చేసి పైప్‌లైన్లు వేశారు. చాలారోడ్లు ఇప్పటికీ అలాగే వున్నాయి. ప్రజలు అవస్థలు పడుతూనే వున్నారు. మెగా, ఎల్ అండ్ టి కంపెనీల వద్ద నుండి అనుభవం లేనివాళ్ళు పనులను సబ్‌కాంట్రాక్ట్‌కు తీసుకుని చేశారు. ఇప్పుడు భూగర్భడ్రైనేజీ పరిస్థితేంటో తెలియడం లేదు. దాని పనులు పూర్తయితే కొంతన్నా నగరంలో పారిశుద్ధ్య సమస్య తప్పుతుంది. ఎక్కడా దీనికి సంబంధించిన పనులు జరుగుతున్న దాఖలాలు లేవు. మంత్రి, నగర ఎమ్మెల్యే అయిన అనిల్‌కుమార్‌యాదవ్ అయినా ఈ సమస్యపై దృష్టిపెట్టాలి.

**పోలిశెట్టి నారాయణ, నెల్లూరు.**



## తెలుగుదేశం నాయకులు..

# చైతన్యవంతులయ్యేనా?

**ఎన్నికలు జరిగి 8 నెలలు అయింది. తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడుకి అధికారం కోల్పోయినప్పటి నుండి మనసు మనసులో ఉండడం లేదు. దీనికితోడు రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వ అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టడంతో ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రజా చైతన్యయాత్రకు శ్రీకారం చుట్టారు.**

చంద్రబాబు ప్రజా చైతన్యయాత్ర ద్వారా ముందు ప్రజలకన్నా, తన పార్టీ నాయకులను చైతన్యవంతులయ్యేలా చూడాలి. ముఖ్యంగా నెల్లూరుజిల్లాలో ఆ పార్టీ పరిస్థితి అధ్వానంగా ఉంది. గత ఎన్నికల్లో నాయకులకు తగిలిన షాక్ నుండి తిరిగి లేవలేని పరిస్థితిలో ఉన్నారు. ఇప్పుడు కార్యక్రమాలు అంటే ఎంతో ఖర్చుతో కూడుకున్న పని. ఈ స్థితిలో నాయకులు ప్రజా చైతన్యయాత్రలో ఉత్సాహంగా పాల్గొంటారా? అన్నది పెద్ద ప్రశ్న. జిల్లాలో నాయకుల పరిస్థితి చూస్తే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోగ్యంగా ఉత్సాహంగా లేడు. ఇటీవల ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతిలో ఉన్నాడు. తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలు అంటే ముందుండి నడిపించేది ఆయనే! ఇక జిల్లా పార్టీ అధ్యక్షుడు బీద రవిచంద్ర పరిస్థితి గందరగోళంగా ఉంది. తన సోదరుడు వైసీపీలో చేరడంతో సొంత గ్రామంలోనే తన పట్టును కోల్పోయాడు. దీనికితోడు శాసనమండలి రద్దుతో ఆయన ఎమ్మెల్సీ పదవి పోయింది. గత ఎన్నికల్లోనే ఆర్థికంగా కొంత నష్టపోయాడు. ఇప్పుడు డబ్బులు ఖర్చు పెట్టుకొని జన చైతన్యయాత్రలు చేసే పరిస్థితిలో ఆయన లేడు.

గత తెలుగుదేశం ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో జిల్లాలో హవా చూపించిన మాజీమంత్రి నారాయణ కూడా ప్రస్తుతం పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. టిడిపి ఆఫీస్‌లో జరిగే కార్యక్రమాలకు హాజరవుతున్నాడేగాని, ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేయడం లేదు. ఇక గత ఎన్నికల్లో ఓడిపోయిన ఎమ్మెల్యే అభ్యర్థులు అందరు కూడా ఎవరి పనుల్లో వాళ్ళున్నారు. మళ్లీ ఎన్నికలు వస్తేగాని వాళ్ళు పార్టీవైపు చూసేలాలేరు.

ఇప్పుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్, మాజీ శాసనసభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిలాంటి వారు మాత్రమే ప్రజా చైతన్య యాత్రలతో పాకులాడుతున్నారు.

# కాంగ్రెస్ కిరీటం చేవూరుకే!



***కాంగ్రెస్‌లోనే పుట్టాడు... కాంగ్రెస్ నాయకుడిగానే మరణించాడు... ఈ కీర్తిని దక్కించుకున్న వారు జిల్లాలో చాలా అరుదుగా వుంటారు. వారిలో అగ్రగణ్యుడు స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి. ఇటీవల స్వర్గస్తులైన బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి, బద్దెపూడి వేణుగోపాలరెడ్డి వంటి నాయకులను కూడా ఆ కోణంలో చూడొచ్చు.***

కాంగ్రెస్‌పార్టీ సెకండ్ సెషన్‌లో ఆ విధంగా చెప్పుకోదగ్గ నాయకుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి. విద్యార్థి దశ నుండి కాంగ్రెస్‌లో వున్నాడు. పార్టీ కష్టకాలంలో వున్న నేటి తరుణంలోనూ ఆయన కాంగ్రెస్‌ను వదల్లేదు. కాంగ్రెస్ ద్వారా ఆయన పొందిన దానికంటే కూడా కాంగ్రెస్‌కు ఆయన చేసిన చాకిరి ఎక్కువ. కాంగ్రెస్ ద్వారా ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు అయినవాళ్ళు కూడా ఆ పార్టీ రాష్ట్రంలో దివాళా తీయగానే ఇతర పార్టీల్లోకి జంప్ అయ్యారు. కాని, దేవకుమార్‌రెడ్డి మాత్రం కాంగ్రెస్‌ను నమ్మకంగా కనిపెట్టుకునే వున్నాడు. కాబట్టే ఇంతటి నమ్మకమైన నాయకుడికి జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్ష బాధ్యతలను మరోసారి అప్పగించారు. గత ఏడాది ఎన్నికలకు ముందు డీసీసీ అధ్యక్షుడుగా వున్న పనబాక కృష్ణయ్య కాంగ్రెస్‌ను వదిలి తెలుగుదేశంలోకి వెళ్లడం, చేవూరు దేవకుమార్‌రెడ్డిని జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలను అప్పగించడం జరిగింది. జిల్లాలో కాంగ్రెస్ చాలా వీక్‌గా వున్నప్పటికీ పార్టీ కార్యక్రమాలను పీక్స్‌కు తీసుకెళ్లాడు చేవూరు. పార్టీ ఉనికిని నిలబెట్టాడు. ఆయన నాయకత్వంలోనే కాంగ్రెస్ మనగలదని భావించి ఇంకోసారి ఆయనకే పీసీసీ కిరీటం పెట్టారు.

## రాష్ట్ర కమిటీలో ముగ్గురికి చోటు



పీసీసీ కమిటీలో జిల్లా నుండి ముగ్గురికి చోటు దక్కింది. మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నాయకులు సి.వి.శేషారెడిడని పార్టీ ముఖ్యసమ న్వయకర్తగా నియమించగా, జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ కమిటీ మాజీఛైర్మెన్ వై.సుమంత్‌రెడ్డిని, ఆత్మకూరుకు చెందిన చేవూరు శ్రీధర్‌రెడ్డిలను పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా నియమించారు.

## 'నుడా' పరుగుపందెంలో..

# ముందుండేదెవరు?

**రాష్ట్ర ప్రభుత్వం శాసనమండలిని రద్దు చేసింది. దీనివల్ల శాసన మండలిలో ప్రస్తుతం వున్న తెలుగుదేశం ఎమ్మెల్సీలు బాధపడొచ్చు... కాని వాళ్ళకంటే ఎక్కువగా మండలి రద్దుకు బాధపడింది వైసిపి నాయకులే! ఎమ్మెల్సీ పదవులను ఎంతమందికి ఇస్తారన్నది చెప్పలేంగాని, పార్టీలో ఎమ్మెల్సీని ఆశించిన వారల్లా కూడా నిరాశ చెందారు.**

ఎమ్మెల్సీలను ఆశించిన నాయకులను సంతృప్తి పరచడానికి ఇక ఆ స్థాయి పద వులు లేవు. రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ ఛైర్మెన్ పదవులున్నా అవి ఎంతమందికని ఇస్తారు? జిల్లా నుండి చూస్తే ఆనం విజయ కుమార్‌రెడ్డి, పొణకా దేవసేన, నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, అల్లంపాటి శ్యాంప్రసాద్ రెడ్డి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, మెట్టుకూరు ధనుంజయరెడ్డి, సాయికృష్ణ యాచేంద్ర, బత్తిని విజయ కుమార్, మేరిగ మురళి వంటి నాయకు లంతా ఎమ్మెల్సీ రేస్‌లో వున్నోళ్ళే! ఇప్పుడు శాసనమండలే లేదు. వీరిలో ఆనం విజయకుమార్‌రెడ్డిని డిసిసిబి ఛైర్మెన్‌ను చేశారు. మిగిలిన వాళ్ళు ఏదో ఒక పదవి ఇవ్వకపోతారా అని ఎదురుచూస్తున్నారు.

మేయర్, మున్సిపల్ ఛైర్మెన్, జడ్పీ ఛైర్మెన్ అన్నవి రిజర్వేషన్‌లను బట్టి వచ్చే పదవులు. వాటిపై ఎవరికీ పెద్దగా ఆశ లుండవు. రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ ఛైర్మెన్



పదవుల భర్తీకి రాష్ట్ర స్థాయిలో పోటీ వుండ డంతో పాటు అక్కడా సామాజికవర్గాల లెక్కలను పరిగణలోకి తీసుకోవాల్సి వుంటుంది.

వీటన్నింటికీ భిన్నంగా కొంచెం మెరుగ్గా కనిపించే పదవి నెల్లూరు పట్ట ణాభివృద్ధి సంస్థ ఛైర్మెన్. వైసిపి అధికారం లోకి వచ్చాక ఈ పదవిని ఇంకా భర్తీ చేయలేదు. 'నుడా' పరిధి కావలి నుండి తడ వరకు ఆరు నియోజకవర్గాల పరిధిలో వుండడంతో ఈ పదవికి పోటీ ఎక్కువైంది. గూడూరు మాజీమున్సిపల్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనతో పాటు అల్లంపాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, ఎం.సుధీర్ కుమార్‌రెడ్డి వంటి నాయకుల పేర్లు ఈ పదవికి ప్రచారంలో వున్నాయి. చివరకు ఎవరు ఎగరేసుకుపోతారో చూడాలి!?

## కార్పొరేషన్‌లో ఎన్నికల ప్రక్రియ

## మళ్ళీ మొదటికొచ్చింది



నెల్లూరు నగరపాలక సంస్థలో ఎన్నికల ప్రక్రియ మళ్ళీ మొదటికొచ్చింది. కార్పొ రేషన్‌లో డివిజన్‌ల విభజన, హద్దుల ఏర్పాటు, ఓటర్ల నమోదు ప్రక్రియను మొదటి నుండి చేపట్టాలని హైకోర్టు ఆదేశించింది. దీంతో మళ్ళీ ప్రక్రియను మొదటి నుండి చేపట్టాల్సి వుంటుంది.

డివిజన్‌ల విభజన, ఓటర్ల నమోదులో అవకతవకలున్నాయంటూ తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరప్రసాద్ గత నెల 10వ తేదీన హైకోర్టులో పిటిషన్ వేయడం తెలిసిందే! ఈ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు, నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల ప్రక్రి యపై మొదట స్టే విధించింది. ఇప్పుడు ఎన్నికల ప్రక్రియనే మార్చమని ఆదేశిం చింది. దీంతో ఇప్పటికిప్పుడు మున్సిపల్ ఎన్నికలను ప్రకటిస్తే, నెల్లూరు కార్పొరేషన్‌కు ఎన్నికలు నిర్వహించడం కష్టమే!

# శ్రీసిటీలో ఇండియన్‌బ్యాంక్ సిఇఓ



ఇండియన్ బ్యాంక్ ఎం.డి, సిఇఓ పద్మజచంద్రు, ఇతర సీనియర్ అధికారులతో కలసి ఈనెల 24న శ్రీసిటీని సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వారికి సాదరస్వాగతం పలికి శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతిని వివరించారు. అనంతరం ఆమె శ్రీసిటీ పరిసరాలతో పాటు రైజింగ్‌స్టార్ మొబైల్స్ (ఫాక్స్‌కాన్ గ్రూప్), ఎవెర్టన్, హంటర్ డగ్లస్ పరిశ్రమలను సందర్శించారు. ఐఐఐటి, క్రియా యూనివర్శిటీలను సందర్శించి అక్కడ అధ్యాపకులు, విద్యార్థులతో చర్చించారు. శ్రీసిటీ విజన్, ప్లానింగ్, పనితీరు పట్ల ఆకర్షితులైన ఆమె ఇక్కడి సువిశాలమైన స్థలం ప్రపంచశ్రేణి మౌలికవసతులకు, వ్యాపారానుకూలతకు ఎంతో అనుకూలంగా ఉందని ప్రశంసించారు. ఇండియన్ బ్యాంక్ సిఇఓ శ్రీసిటీని సందర్శించడం తమకు గౌరవ ప్రదంగా భావిస్తున్నామని శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. శ్రీసిటీలో ప్రస్తుతం ఉన్న మూడు మేజర్ బ్యాంకులే కాక, మరిన్ని బ్యాంక్‌లు కూడా ఇక్కడ ఏర్పాటై పారిశ్రామికవర్గాలతో పాటు ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన బ్యాంక్ సేవలు లభిస్తాయని ఆశిస్తున్నా మని ఆయన పేర్కొన్నారు. చెన్నైకి చెం దిన ఇండియన్‌బ్యాంక్ జనరల్ మేనేజర్ చంద్రారెడ్డి, ఇండియన్‌బ్యాంక్ కార్పొరేట్ బ్రాంచ్ డిజిఎం ప్రదీప్ పిలాంకర్ తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



# ప్రతిష్ఠాత్మకంగా రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల గోడపత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి అనిల్

నెల్లూరు రంగనాయకులపేట పినాకినీ నదీ తీరాన కొలువైయున్న శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని రాష్ట్ర జలవనరులశాఖా మంత్రి అనిల్ కుమార్ యాదవ్ అధికారులకు సూచించారు. దేవస్థానంలో మార్చి నెల 4 నుండి 14వతేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలపై వివిధ శాఖల అధికారులతో ఈనెల 22న మంత్రి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు జిల్లా నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో వస్తారని వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. రథోత్సవం జరిగే ప్రాంతాలలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి విద్యుత్ తీగలకు మరమ్మత్తులు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. రథోత్సవం సాగే రోడ్లు మరమ్మత్తులకు గురై వుంటే చేయించాలన్నారు. పారిశుధ్య లోపం తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కార్పొరేషన్ అధికారులకు సూచించారు. తొలుత బ్రహ్మోత్సవాల గోడపత్రికను ఆవిష్కరించారు. ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్, దేవాదాయశాఖ సహాయ కమీషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, ఆలయ ఛైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వహణాధికారి డి.వెంకటేశ్వర్లు, వైయస్సార్‌సీపీ నాయకులు రూప్‌కుమార్‌యాదవ్, సన్నపురెడ్డి పెంచలరెడ్డి, శ్రీరాం సురేష్, వందవాసి రంగా, ధర్మకర్తల మండలి సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మహాకవి తిక్కన సోమయాజి విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి అనిల్

ఈ సందర్భంగా దేవస్థానం ప్రాంగణంలో పినాకినీ నదీ తీరాన ఏర్పాటు చేసిన మహాకవి తిక్కన సోమయాజి విగ్రహాన్ని రాష్ట్ర జలవనరులశాఖా మంత్రి అనిల్ కుమార్‌యాదవ్ ఆవిష్కరించి మాట్లాడుతూ గతంలో మహాకవి తిక్కన మందిరాన్ని పునర్నించాలని శంకుస్థాపన చేసినా కార్యరూపం దాల్చలేదని, బయ్యా వెంకట రమణయ్య మెమోరియల్ ట్రస్ట్, శుభమస్తు షాపింగ్ మాల్ నిర్వాహకులు బయ్యా సరోజనమ్మ, బయ్యా శ్రీనివాసులు, బయ్యా వెంకటరవికుమార్ ఆధ్వర్యంలో మహాకవి తిక్కన విగ్రహం, మందిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రంగనాథస్వామి ఆలయం వద్ద పెన్నాఘాట్ పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు.

# డిగ్రీ సెమిస్టర్‌లో కృష్ణచైతన్య రికార్డ్


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ పి.చంద్రశేఖర్‌రెడ్డి

విక్రమసింహపురి యూనివర్శిటీ ఇటీవల విడుదల చేసిన ఫిఫ్త్ సెమిస్టర్ డిగ్రీ ఫలితాల్లో కృష్ణచైతన్య కళాశాల విద్యార్థులు యూనివర్శిటీ స్థాయిలో రికార్డ్ సృష్టించారని ఆ కళాశాల డైరెక్టర్లు ఆర్‌వి కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. బిఎస్సీ, బికాం, బిబిఎ, బిసిఎ, యంసిఎ, డ్యుయల్ డిగ్రీ సెమిస్టర్స్‌లో తమ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారన్నారు. అన్నికోర్సుల్లోనూ కలిపి యూనివర్శిటీ పరిధిలో షబానాబేగం అనే విద్యార్థిని వెయ్యి మార్కులకుగాను 994 మార్కులు సాధించి యూనివర్శిటీ స్థాయిలో ప్రధమస్థానంలో నిలిచిందన్నారు. బిఎస్సీలో కె.నవ్యశ్రీ, జ్యోతిస్వరూప్, ప్రియవర్షిణి, పావని, 9.9 జిపిఎ సాధించారని, అదేవిధంగా బిసిఏలో షబానాబేగం, 9.9 జిపిఎ సాధించగా, బిబిఏలో హైందవి 9.5, బికాంలో వై.దివ్య, అలీష, ఇందిర 9.5, ఎంఎస్‌సి డ్యుయల్ డిగ్రీలో భార్గవి 9.8, జిపిఏలతో యూనివర్శిటీ స్థాయిలో అన్ని విభాగాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించారని పేర్కొంటూ వారిని పుష్పగుచ్ఛాలతో అభినందించారు. కళాశాల డీన్ బి.సుధారాణి, ప్రిన్సిపాల్స్ యన్.కృష్ణకుమార్, యన్.నాగయ్య, వైస్‌ప్రిన్సిపాల్స్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

# 6వ బ్యాచ్ శిక్షణ ప్రారంభం



ధృవీకరణ పత్రాలు అందజేస్తున్న ఎస్పీ(క్రైం) మనోహర్‌రావు, గోపాలకృష్ణ

ఈ నెల 24వ తేదీన చెముడుగుంటలోని పోలీస్ శిక్షణా కేంద్రంలో 6వ బ్యాచ్ గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శుల 2వారాల శిక్షణను శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్, ఏఎస్పీ(క్రైం) పి.మనోహర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మనోహర్‌రావు మాట్లాడుతూ మహిళలు, బాలల సమస్యలను పరిష్కరించే దిశగా ఇక్కడ శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణలో డయల్ 100, 181, దిశ, మహిళామిత్ర, సైబర్‌మిత్ర, ఐపిసి, సిఆర్‌పిసి వంటి చట్టాలతో పాటు ఐసిడిఎస్ నిధులపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. మహిళా సంరక్షణ కార్యదర్శుల శిక్షణలో నెల్లూరుజిల్లా పోలీస్ శిక్షణా కేంద్రానికి రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు వచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న 5వ బ్యాచ్ మహిళా సంరక్షణ కార్యదర్శులకు ఏఎస్పీ సర్టిఫికేట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ, శిక్షణా కేంద్రం వైస్‌ప్రిన్సిపాల్ ఎస్.వి.గోపాలకృష్ణ, శిక్షణా కేంద్రం ఆర్.ఐ డి.సురేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

### మార్చి చివరిలో

# ఐఏబి సమావేశం

జిల్లా సాగునీటి సలహామండలి సమావేశాన్ని మార్చి మూడోవారంలో నిర్వహిచేలాగా ఇరిగేషన్ అధికారులకు జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్ కుమార్‌యాదవ్ సంకేతాలిచ్చాడు. రెండో పంటకు నీళ్లిచ్చే విషయమై ఈ సమావేశంలో నిర్ణయం తీసుకోవాల్సివుంది. ప్రస్తుతం సోమశిలలో 55 టీఎంసీల దాకా నీళ్లున్నాయి. రెండో పంటకు పాతిక టీఎంసీల దాకా ఇవ్వాల్సి వుంటుంది. తాగునీటి అవసరాలు, ఇతర ప్రాంతాలకు పంపాల్సిన నీళ్ల లెక్కలను బేరీజు వేసుకుని రెండో పంటకు ఎన్ని నీళ్లివ్వాలి, ఎన్ని ఎకరాల్లో పంటలేయాలన్నది నిర్ణయిస్తారు.

### భగవద్గీత పఠనంతో

# ఒడిదుడుకుల్లేని జీవితం


విజేతలకు సైకిల్‌ను బహుకరిస్తున్న సుకదేవస్వామి

ఆధ్యాత్మిక చింతనతో పాటు భగవద్గీత పఠనంతో ఒడిదుడుకుల్లేకుండా జీవితం సాగుతుందని నెల్లూరు ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు డా. సుకదేవస్వామి అన్నారు. ఈనెల 23న ఆయన విద్యార్థులకు భగవద్గీత పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులిచ్చారు. నగరంలోని మినీబైపాస్‌రోడ్డులో ఉన్న ఇస్కాన్ మందిరం ఆవరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన భగవద్గీత ప్రాముఖ్యతను వెల్లడించారు. నేటి కాలంలో రానురాను నైతికవిలువలు, వ్యక్తిత్వ వికాసం, ఆధ్యాత్మిక అవగాహన లోపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు మంచి లక్ష్యాలతో, సేవాభావంతో, ఆధ్యాత్మిక విలువలు, ఆత్మజ్ఞానంతో రాణించాలన్నారు. అనంతరం భగవద్గీత పోటీల్లో జిల్లాస్థాయి విజేతకు స్పోర్ట్స్ సైకిల్‌ను బహుమతిగా అందజేశారు.

### ఫీజు రీయంబర్స్‌మెంట్ కోసం

# ఏబివిపి దీక్ష

ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా పూర్తి స్థాయిలో ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను, స్కాలర్‌షిప్‌లను వెంటనే మంజూరు చేయాలని కోరుతూ ఏబివిపి ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన నెల్లూరు మద్రాసు బస్టాండ్ వద్ద రిలేదీక్ష చేపట్టారు.

151 మంది వైసిపి ఎమ్మెల్యేల సంఖ్యను సూచిస్తూ 151మంది విద్యార్థులు ఈ దీక్షలో కూర్చున్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ కోసం విద్యార్థులు రాష్ట్ర వ్యాప్తంగా నెలరోజుల నుండి ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడం శోచనీయమని ఏబివిపి రాష్ట్ర కార్యదర్శి చల్లా కౌషిక్ విమర్శించారు. విద్యార్థులకు న్యాయం చేయలేకపోయిన 151 మంది ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామాలు చేయాలని ఆయన డిమాండ్ చేశాడు. ఫీజు రీయంబర్స్‌మెంట్ రాక ఎంతోమంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నాడు.

ఈ కార్యక్రమంలో ఏబివిపి పూర్వనేతలు కోడూరు సత్యం, చంద్రశేఖరరాజు, ఏబివిపి జాతీయ కార్యవర్గ సభ్యులు మనోజ్‌కుమార్, జిల్లా కన్వీనర్ కార్తీక్, కో-కన్వీనర్ రాజశేఖర్, నగర కార్యదర్శి జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాకు 'నాడు-నేడు' నిధులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'నాడు-నేడు' కార్యక్రమంలో భాగంగా జిల్లాకు 13కోట్ల రూపాయలు విడుదలైనట్లు సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ బ్రహ్మానందరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిధులతో జిల్లాలో మొదటి విడతగా 1027 ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు.

### ఇంటర్ పరీక్షలకు

# పకడ్బందీ ఏర్పాట్లు

మార్చి4 నుండి జరిగే ఇంటర్మీడియట్ పరీక్షల కోసం జిల్లా అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. ప్రతి పరీక్ష హాలులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 87 పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగింది. మార్చి 4వతేదీ నుంచి 23వతేదీ వరకు ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరుగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 56,789మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు

### కాలుష్యానికి విరుగుడు

# చెట్లు నాటడమే

పెరిగిపోతున్న కాలుష్యాన్నికి విరుగుడు చెట్లు నాటడం అని నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ ఆకుల మహేంద్రరెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం నెల్లూరు గాంధీనగర్‌లోని స్వతంత్ర పార్క్‌లో గౌతమ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చెట్లు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ నెల్లూరు నగరంలోని వాకర్స్ అసోసియేషన్‌లు అన్ని కూడా చెట్లు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుడితే నగరంలో కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జయప్రకాష్, మాజీ కార్పొరేటర్ పత్తి సత్యనారాయణ, డాక్టర్ రమణయ్య, రామ్మోహన్, బండి ప్రశాంత్ పెద్ద ఎత్తున సభ్యులు మొక్కలు నాటారు. అంతకుముందు గౌతమ బుద్ధుడు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

### ఇందిరాభవన్‌లో...

# పెద్దాయన జయంతి



మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి 85వ జయంతిని పురస్కరించుకుని నెల్లూరులోని ఇందిరా భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నేదురుమల్లి ఫౌండేషన్ ఛైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, నెల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఏసునాయుడు, జిల్లా కాంగ్రెస్ ఎస్సీసెల్ కమిటీ ఛైర్మన్ టి.బాలసుధాకర్ తదితరులు పాల్గొన్నారు

# నెల్లూరు యువకుడి అరెస్ట్

ఏపీ ఉపముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి పై సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెట్టిన నెల్లూరుకు చెందిన ఓ యువకుడిని విజయనగరం పోలీసులు అరెస్ట్ చేశారు. అతను బెంగళూరులో ఓ హోటల్లో పని చేస్తున్నాడు. గత ఏడాది అక్టోబర్‌లో ఆ పోస్టు పెట్టడంతో శ్రీవాణి విజయనగరం జిల్లా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడి సెల్‌ఫోన్ ఆధారంగా వివరాలు సేకరించి బెంగళూరు వెళ్లి అతన్ని అదుపులోకి తీసుకున్నారు.

# ట్రాఫిక్ సమస్యలకు చెక్



విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్

పద్మవ్యూహాన్ని తలపించే నెల్లూరు నగరంలోని ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తానని రాష్ట్ర జలవనరులశాఖా మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఈనెల 22వ తేదీన 16 వ డివిజన్ ఆదిత్యనగర్, రాంజీనగర్ ప్రాంతాల్లో మంత్రి అధికారులతో కలిసి పర్యటించారు. నగరంలో ఇప్పటికే రూ.200 కోట్లతో తలపెట్టిన కొన్ని పనులు ప్రారంభమయ్యాయని, తమ ప్రభుత్వం మినీబైపాస్ రోడ్డులోని జీపీఆర్ కల్యాణ మండపం నుంచి జోయలూకాస్ వరకు ఫ్లైఓవర్‌ను మంజూరు చేసిందన్నారు. రూ.30 కోట్లతో నిర్మించే ఫ్లై ఓవర్ పనులకు మార్చి నెలలో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి ఏప్రిల్‌లో పనులు ప్రారంభిస్తామన్నారు. నగరంలో అవసరమైన చోట్ల మరో 4 ఫ్లై ఓవర్లు మంజూరు చేయించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్పొరేషన్ పరిధిలో ప్రతి వీధిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ట్రాఫిక్, నేర నియంత్రణ దిశగా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించామని, సాంకేతిక కారణాలతో నిలిచిన పెన్షన్లను పరిశీలించి తిరిగి పునరుద్ధరణ చేపడుతామన్నారు. వేనాటి శ్రీకాంత్ రెడ్డి, కోడూరు విష్ణువర్ధన్ రెడ్డి, బిజివేముల భాస్కరరెడ్డి, ఓడూరు మనోహర్‌రెడ్డి, మెట్టు శశిధర్ రెడ్డి, సగిలి జయరామిరెడ్డి, సురేష్‌రెడ్డి, దార్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## మండుడెండల్లో పనులు నిషేధం

ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని మండుడెండల్లో మధ్యాహ్నం 12 నుండి 3 గంటల వరకు పనులు చేయడాన్ని నిషేధించినట్లు జిల్లా కలెక్టర్ యంవి శేషగిరిబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పని ప్రదేశంలో సురక్షిత తాగునీరుకు రూ.5 అదనంగా ఇస్తారని, సాధారణ వేతనం కన్నా ఎండల తీవ్రతను బట్టి అదనంగా ఫిబ్రవరిలో 20 శాతం, మార్చిలో 25 శాతం, ఏప్రిల్, మే నెలలో 30 శాతం, జూన్ నెలలో 20 శాతం అందజేస్తారని తెలిపారు. పని ప్రదేశంలో చిన్నపిల్లల సంరక్షణకు ఆయాను నియమిస్తామని, జిల్లా వైద్యశాఖాధికారి సహకారంతో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తామన్నారు. పని చేసే చోట ప్రథమ చికిత్స బాక్స్‌లు, నీడ కోసం పట్టలు వేయడం జరుగుతుందన్నారు.



## మన మనసుల్లో వాళ్ళు మహనీయులు

ఈనెల 23వతేదీన విడవలూరు మండలం ముదివర్తి గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ మంత్రివర్యులు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డిల విగ్రహాలను మాజీ పార్లమెంట్ సభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మేకపాటి రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ చరిత్రలో వైయస్ రాజశేఖర రెడ్డి, నెల్లూరు జిల్లాలో నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డిలను ఎవరూ మర్చిపోలేరన్నారు. రాష్ట్రానికి, జిల్లాకు వాళ్ళు అందించిన సేవలు నిరుపమానమన్నారు. వైయస్ రాజశేఖర్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ అలాగే తన తండ్రి శ్రీనివాసరెడ్డి ఆశయాలను నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పుణికి పుచ్చుకొని ప్రజా సేవలో తరిస్తున్నారని కొనియాడారు. కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి తనకు రాజకీయ జన్మనిస్తే దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి తన రాజకీయ భవిష్యత్తుకు మంచి మార్గాన్ని అందించారని పేర్కొన్నారు. రాజకీయ చరిత్రలో వైయస్ రాజశేఖర్‌రెడ్డి లాంటి నాయకుడిని తన జన్మలో చూసి ఉండనని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైకాపా నాయకులు సుబ్బారెడ్డి, గండవరం రాధా కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రానికి జగనే శాశ్వత సీఎం



సచివాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యేలు ఆనం, కాకాణి

తాను చేపట్టిన సంక్షేమ పథకాలతో ఈ రాష్ట్రానికి వైయస్ జగన్మోహన్‌రెడ్డి శాశ్వత సీఎంగా ఉండిపోతారని వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈనెల 24వ తేదీన సైదాపురం గ్రామంలో 5.8 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులకు సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాని గోవర్ధన్‌రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే సైదాపురం 1, 2 గ్రామ సచివాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రాజన్న రాజ్యం మళ్లీ నడుస్తోందని, నవరత్నాలలో భాగంగా జగనన్న వసతి దీవెన, రేషన్ కార్డుల పంపిణీ, ఇళ్ల పట్టాల పంపిణీ, అమ్మ ఒడి వంటి కార్యక్రమాలను వేగంగా అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పుడు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో 20ఏళ్ళ పాటు వైఎస్ జగన్మోహన్‌రెడ్డే సీఎంగా ఉంటారని ఆయన పేర్కొన్నారు.




నిర్యాణం : 1995, మార్చి 1వ తేదీ

స్వర్గీయ శ్రీమతి రుక్మిణమ్మ

(స్వర్గీయ తిక్కవరపు బాబురెడ్డి గారి ధర్మపత్ని)

మాతృదేవోభవ



మా మాతృమూర్తి దైవసన్నిధికి చేరి
25 ఏళ్ళు నిండనున్న సందర్భంగా
ఆమె ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తూ...
ఆమె ఆత్మీయులైన వారందరికీ
మా మాతృదేవత ఆశీస్సులు కోరుకుంటూ...

డా॥ టి.సుబ్బరామిరెడ్డి
రాజ్యసభ సభ్యులు
మరియు
వారి కుటుంబసభ్యులు

# నెల్లూరులో ఇబిక్స్ క్యాష్ కార్యాలయం


ఇబిక్స్ కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న కమిషనర్ పివిఎస్ మూర్తిని సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్రముఖ అంతర్జాతీయ ఫారిన్ ఎక్స్చేంజ్, టూరిజం కంపెనీ ఇబిక్స్ క్యాష్ ట్రావెల్ అండ్ హాలిడేస్ సంస్థ తమ బ్రాంచ్‌ను నెల్లూరు నగరం, వెంకట్రామపురంలోని విజయ మహల్‌గేటు వద్ద ఏర్పాటు చేసింది. ఈ బ్రాంచ్ కార్యాలయాన్ని ఈ నెల 26వ తేదీన నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ పివిఎస్ఎస్ మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ట్రావెల్ అండ్ టూరిజంలో ఎప్పటికప్పుడు నూతన ఆవిష్కరణలు చోటు చేసుకుంటున్నాయని, ఈ ఆవిష్కరణల ద్వారానే ఎంతోమందికి ఉపాధి అవకాశాలు కలుగుతున్నాయని చెప్పారు. మెట్రో నగరాలకే పరిమితమైన ఎన్నో కంపెనీలు ఇప్పుడు నెల్లూరులో తమ శాఖలు ఏర్పాటు చేస్తున్నాయని, ఈ నగరం దినదిన ప్రవర్ధమానం అవుతుందనడానికి ఇదొక ఉదాహరణని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా శుభమస్తు షాపింగ్ మాల్ అధినేత బయ్యా శ్రీనివాసులు, హోటల్ డికార్ ఉత్తమ అధినేత కొడవలూరు దీపక్‌రెడ్డి, అమ్మ ఫర్నీచర్‌మాల్ అధినేత గడ్డం సుజన్‌రెడ్డి, మదీనా వాచ్ ఏజన్సీ అధినేత ఇంతియాజ్, నెల్లూరు రోటరీ క్లబ్ గవర్నర్ రాఘవేంద్రషెట్టి, లయన్స్ క్లబ్ ఆఫ్ పినాకిని అధ్యక్షులు లీలాధర్‌రెడ్డి, పోలీసు అధికారుల సంక్షేమ సంఘం నెల్లూరుజిల్లా అధ్యక్షులు ఎం.ప్రసాద్‌రావులు పాల్గొన్నారు. కార్యాలయం నిర్వాహకులు రవీంద్రబాబు, తేజలను అతిథులు అభినందించారు.

## రక్త దానానికి ముందుకు రండి...

ప్రతిఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 25న సెయింట్‌జాన్స్ అంబులెన్స్, రెడ్ క్రాస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సపై నెల్లూరులో ఏర్పాటు చేసిన మూడురోజుల శిక్షణ తరగతులను ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెడ్‌క్రాస్ నుంచి ప్రథమ చికిత్స, విపత్తుల నుంచి రక్షణ వంటి అంశాలపై శిక్షణ కార్యక్రమాలను నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం గుండెపోటు, ఎముకలు విరగడం, రక్తస్రావం, పాము, తేలు కరిచి నపుడు తీసుకోవాల్సిన ప్రథమ చికిత్స పద్ధతులపై శిక్షణ ఇచ్చారు.

రీజినల్ కో–ఆర్డినేటర్ గంటా వెంకట రవికుమార్, యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్ కన్వీనర్ రమణయ్య, రక్తనిధి చీఫ్ మెడికల్ ఆఫీసర్ యశోవర్ధన్, జిల్లా కార్యదర్శి మస్తానయ్య, డీఎఫ్‌వో వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఉపయోగపడేలా భరోసా కేంద్రాలు

- కలెక్టర్ శేషగిరిబాబు



రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించే విధంగా రైతు భరోసా కేంద్రాలను పటిష్టంగా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు పేర్కొన్నారు. ఈనెల 25వ తేదీన నెల్లూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో రైతు భరోసా కేంద్రాల నిర్వహణపై వ్యవసాయ శాఖ మరియు దాని అనుబంధ శాఖల అధికారులతో ఏర్పాటుచేసిన వర్క్ షాప్‌లో ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రైతులకు అండగా ఉండి నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు పంపిణీ చేయడంతో పాటు వారికి అవసరమైన సాంకేతిక సలహాలు సూచనలు అందించే లక్ష్యంతో రైతుభరోసా కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో 539 రైతు భరోసా కేంద్రాలను ప్రతిపాదించగా, తొలివిడతగా మార్చి 1వతేదీ నాటికి మండలానికి 5వంతున జిల్లాలో 230 రైతు భరోసా కేంద్రాలను రైతులకు అందుబాటులోకి తేనున్నామన్నారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, మార్కెటింగ్ పశుసంవర్ధక శాఖ మత్స్యశాఖ సరికల్చర్, డైరీ డెవలప్‌మెంట్ తదితర శాఖల సిబ్బంది విధులు నిర్వహిస్తూ రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఆయన సూచించారు. పౌరసరఫరాల శాఖ అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని వ్యవసాయ శాఖ అధికారులు ప్రతిరోజు క్షేత్రస్థాయిలో పర్యటించి ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. వ్యవసాయ శాఖ జెడి ఆనంద్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు

## గూడూరు డివిజన్ వార్తలు

# విద్యాభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో వైకాపా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే వరప్రసాదరావు తెలిపారు. గూడూరు పట్టణంలోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో జగనన్న వసతి దీవెన పథకాన్ని సబ్‌కలెక్టర్ గోపాల కృష్ణ, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి సుధాకర్‌లతో కలిసి ఈనెల24న ప్రారంభించి, విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో 6,250 మంది అర్హులుగా గుర్తించి కార్డులను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్థికంగా చదువుకు ఎవరూ దూరం కాకుండా ఉండాలనే లక్ష్యంతో దివంగత మాజీముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి ఫీజు రీయంబర్స్‌మెంట్ ప్రవేశపెట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, ఎంపీడీవోలు నాగమణి, భవానీ తదితరులు పాల్గొన్నారు.

### రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

రైతు కష్టపడి పండించిన పంటకు మద్దతు ధర కల్పించి రైతన్న ముఖంలో సంతోషం చూడాలన్నదే వైకాపా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వరప్రసాదరావు తెలిపారు. గూడూరు మండలం చెన్నూరు, విందూరు గ్రామాల్లో వేర్వేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం రాత్రి వైకాపా నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ లీలారాణి, ఏడిఏ శివనాయక్, ఏవో నాగమోహన్, వైకాపా నాయకులు మల్లు విజయకుమార్ రెడ్డి, రాజారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## డిఆర్‌డబ్ల్యూ కళాశాలలో కరాటేపై శిక్షణ

గూడూరు పట్టణంలోని డిఆర్‌డబ్ల్యూ కళాశాలలో కరాటేపై శిక్షణా తరగతులను సెట్నల్ వారి సహకారంతో కరాటే మాస్టర్ వసంతకుమార్ ఆధ్వర్యంలో 22వ తేదీ నిర్వహించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.భారతలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల ఆత్మ రక్షణకు కరాటే నేర్చుకోవడం ఎంతో ఉపయోగకరమని చెప్పారు. ప్రతి వారం కరాటేపై ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. నేటి పరిస్థితుల్లో ప్రతి విద్యార్థినికి కరాటే ఎంతో ప్రయోజనకరమని తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ విజయకళ, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఉపాధి పనులు కల్పించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న దివిపాలెం గ్రామస్థులు

గూడూరు మండలం దివిపాలెం గ్రామంలో ఉపాధిహామీ పథకం ద్వారా చేస్తున్న పనులు నిలిపి వేయడంతో జీవనోపాధి కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆ గ్రామస్థులు పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఈ నెల 24న ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దివిపాలెం పంచాయితీ పురపాలక సంఘంలో విలీనం చేయడంతో ఉపాధి పనులు లేక పంచాయతీలోని దివిపాలెం, చవటపాలెం, తిలక్‌నగర్, అడవికాలనీ, వేములపాలెం, తదితర గ్రామాల ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోందని చెప్పారు. పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంకమ్మ, సుజాత, గురులక్ష్మి, ధనమ్మ, రమాదేవి తదితరులు ఉన్నారు. తదుపరి వారు ఎమ్మెల్యే వరప్రసాదరావును కలిసి పనులు కల్పించాలని వినతిపత్రాన్ని సమర్పించారు.

# అన్న క్యాంటీన్లను మూసేయడం దారుణం


వంటా వార్పు కార్యక్రమాన్ని చేస్తున్న మాజీఎమ్మెల్యే పాశం సునీల్

పేదవారికి మూడుపూటలా రూ.15లకే ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్లను మూసివేయడం దారుణమని మాజీఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని అన్న క్యాంటీన్ వద్ద తెలుగుదేశంపార్టీ నాయకులతో కలిసి వంటా వార్పు కార్యక్రమాన్ని ఈ నెల 24న మాజీముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ అన్నక్యాంటీన్‌లను మూసివేసి రాష్ట్రప్రభుత్వం పేదవారికి ఆకలిని మిగిల్చిందని అన్నారు. మూడు రాజధానులు వద్దు అమరావతే ముద్దు అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్‌ఛైర్మన్ శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, బిల్లు చెంచురామయ్య, వాటంబేడు శివకుమార్, పులిమి శ్రీనివాసులు, కొండూరు వెంకటేశ్వర్లురాజు, నిమ్మకాయల నరసింహులు, ఇస్రాయిల్‌కుమార్, పి.శ్రీనివాసులు, కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న రిలే దీక్షలు


దీక్ష చేస్తున్న ముస్లిం జేఏసీ నాయకులు

గూడూరు పట్టణంలోని పెద్దమసీదు ప్రాంతంలో సిఏఏ, ఎన్ఆర్‌సి, ఎన్‌పిఆర్ చట్టాలను కేంద్రప్రభుత్వం రద్దు చేయాలని కోరుతూ ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరసన దీక్షలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ చట్టాలకు వ్యతిరేకంగా అన్ని చోట్ల నిరసనలు చేపడుతున్నా, కేంద్రప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. బీజేపీ ప్రభుత్వం వల్ల పేదప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తోందని తెలియజేశారు. చట్టాలు రద్దు చేసే వరకు దీక్షలు కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సంఘం, వామపక్షాల నాయకులు అన్వర్, షాజు, అర్షద్, జావీద్, ఇస్మాయిల్, కాలేషా, ఆరీఫ్, ఇబ్రహీం, యాదగిరి, కేశవులు పాల్గొన్నారు.



# గీతాంజలిలో కెరీర్ అడ్వాన్స్‌మెంట్‌పై సదస్సు

గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఈనెల 24న వ్యక్తిత్వ వికాసం-ఉజ్వల భవిష్యత్ నిర్మాణం అనే అంశంపై ప్రథమ సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ మోటివేటర్, మైండ్ స్మార్ట్ సంస్థ అధినేత జి.వాసు పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు దృఢదీక్ష, ప్రణాళికాబద్ధమైన చదువు, కృషి, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, చొరవ వుంటే తప్పకుండా విజయం సాధించగలరన్నారు. విద్యార్థులు తమకంటూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమంతప్పకుండా క్రమశిక్షణాయుతమైన కృషి చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.జి.సుబ్బారావు, ఎస్ అండ్ హెచ్ విభాగం అధిపతి డా.పిఎం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# బంద్ ప్రశాంతం




ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పదోన్నతులలో రిజర్వేషన్‌లను నిలిపివేస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ ఈ నెల 23న ఎస్సీ, ఎస్టీ, బిసి, ముస్లిం మైనార్టీల రిజర్వేషన్ రాజ్యాంగ పరిరక్షణ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ నెల్లూరులో ప్రశాంతంగా జరిగింది. ఈ బంద్‌కు దళిత సంఘాలు, బిసి సంఘాలతో పాటు వైసిపి, టిడిపి, సిపిఎం, సిపిఐలు కూడా మద్దతు తెలిపాయి. ఆర్టీసీ బస్టాండ్, ఆత్మకూరు బస్టాండ్ కూడళ్లలో బంద్ నిర్వాహకులు బస్సులను నిలిపేశారు.

# దేశంలో బ్రతకాలంటే సర్టిఫికేట్ కావాలా?

## - పిసిసి అధ్యక్షుడు శైలజానాథ్

భారతదేశంలో బ్రతకాలంటే ఇక్కడే పుట్టినట్లు సర్టిఫికేట్ తీసుకురావాలనే కేంద్ర ప్రభుత్వ నిరంకుశ చర్యలను ఖండిస్తున్నట్లు పిసిసి అధ్యక్షులు సాకే శైలజానాథ్ పేర్కొన్నారు. 23వ తేదీ రాత్రి నెల్లూరు నగరం, ట్రైకన్‌రోడ్డులో సిఏఏ, ఎన్‌సిఆర్, ఎన్‌పిఆర్ బిల్లులకు వ్యతిరేకంగా జిల్లా కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'భారత్ బచావో' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఈ దేశాభివృద్ధిలో ముస్లింల పాత్ర విస్మరించలేనిదన్నారు. ఎన్‌సిఆర్, ఎన్‌పిఆర్, సిఏఏ బిల్లులకు వ్యతిరేకంగా ఢిల్లీ తర్వాత నెల్లూరులోనే పోరాటాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు.

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలను మతాలవారీగా విభజించే ప్రయత్నం చేస్తోందని, బీజేపీ కుటిలయత్నాలను అడ్డుకుంటామని అన్నాడు. సిఏఏ, ఎన్‌సిఆర్, ఎన్‌పిఆర్ బిల్లులను దేశంలో అమలు కాకుండా అడ్డుకునేందుకు కాంగ్రెస్‌పార్టీ నిరంతరం పోరాడుతుందని మైనార్టీలకు తామంతా అండగా ఉంటామని అన్నాడు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఛైర్మెన్ అహ్మద్ ఆలీఖాన్, కాంగ్రెస్ నాయకులు ఉడతా వెంకట్రావ్, వై.సుమంత్‌రెడ్డి, చేవూరు శ్రీధర్‌రెడ్డి, ఫయాజ్, ఆసిఫ్‌పాషా, టి.బాలసుధాకర్, అల్లావుద్దీన్, అజంతుల్లాఖాన్, షకీర్, ముస్తి ఇలియాజ్, ఇంతియాజ్ పాల్గొన్నారు.




'భారత్ బచావ్' సభలో మాట్లాడుతున్న పిసిసి అధ్యక్షుడు శైలజానాథ్

# అక్రమార్కులపై వేటు

నెల్లూరుజిల్లా సైదాపురం తహసీల్దార్ ఎస్.చంద్రశేఖర్‌తో పాటు మల్లాం, ఈశ్వరవాక వీఆర్‌ఓలు బి.రమేష్, ఎం.వెంకటరమణయ్య, చిట్టమూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆఫీసు సబార్డినేట్ ఎం.ప్రసాద్‌లను సస్పెండ్‌చేస్తూ జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు ఈనెల 22న ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 5న సూళ్ళూరుపేటకు చెందిన నాగార్జున కుటుంబంతో సహా కలెక్టరేట్‌లో ఆత్మహత్యా ప్రయత్నానికి ప్రయత్నించడంతో డీఆర్‌ఓ మల్లికార్జున, పోలీసు అధికారులు నాగార్జునను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణ సమయంలో చిట్టమూరు మండలంలో పలు గ్రామాల్లో ప్రభుత్వ భూములకు పట్టాలు ఇచ్చేందుకు రూ.1.20కోట్లు రైతుల నుంచి వసూలుచేసి తహసీల్దార్ చంద్రశేఖర్‌కు ఇచ్చానని, పట్టాలు మంజూరు చేయకుండా బదిలీపై వెళ్ళడం, ఇచ్చిన నగదు తిరిగి ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు పెడుతున్నారని, చేసేదిలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు వెల్లడించాడు. ఈ విషయంపై గూడూరు సబ్‌కలెక్టర్‌ను విచారణాధికారిగా కలెక్టర్ నియమించారు. సబ్‌కలెక్టర్ విచారణ చేసి నివేదికలందజేశారు. ఆ నివేదికల ఆధారంగా తహసీల్దార్, ఇద్దరు వీఆర్‌ఓలు, ఆఫీస్ సబార్డినేట్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. జిల్లా కలెక్టర్ అనుమతి లేనిదే వారు హెడ్‌క్వార్టర్స్ వదిలి వెళ్ళడానికి వీల్లేదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్ళాల్సి వస్తే జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకోవాల్సి వుంది. బాలాయపల్లి తహసీల్దార్ ఆదిశేషయ్యను సైదాపురం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమించారు.

శ్రీను గల్పిక

# లోకేష్ ఆస్తుల వివరాలను చూసిన ట్రంప్

ఢిల్లీలోని పాలం అంతర్జాతీయ విమానాశ్రయం. పెద్దఎత్తున సెక్యూరిటీ సిబ్బంది వున్నారు. ఎయిర్‌పోర్టులో కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జయశంకర్, హోంశాఖ మంత్రి అమిత్‌షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులంతా వున్నారు. అప్పుడే అమెరికా అధ్యక్షుడి ఏ1 విమానం అక్కడ ల్యాండయ్యింది. అందులో నుండి ముందుగా దుప్పట్లు, పరుపులు, మంచాలు, కంచాలు, నాప్‌కిన్స్, నీళ్ల బాటిల్స్ వంటి వివిధ రకాల వస్తువులు దించారు. అవి చూసి రాజ్‌నాథ్‌సింగ్ పక్కనేవున్న నిర్మలా సీతారామన్‌తో... ఇంతకీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్‌ట్రంప్ వచ్చాడా? ఆయన రాలేక ఈ వస్తువులన్నీ మనకు పంపించాడా అని అడిగాడు. దానికి సీతారామన్.. ట్రంప్ వచ్చాడు, కాకపోతే ఆయన తిన్నాక మూతి తుడుచుకునే పేపర్ ముక్కను కూడా తనతో పాటే తెచ్చుకున్నాడు. మన వస్తువులేవీ ఆయన ముట్టడంట అని చెప్పింది. కరోనా వైరస్ ఎఫెక్టా అని రాజ్‌నాథ్ అడిగాడు. అదేం కాదు, వాళ్లు మన వస్తువులను వాడరు, వాళ్ల వస్తువులను మనమే కొనుక్కొని వాడాలి, వాళ్ళ మార్కెటింగ్‌కి ఇదో సింబాలిక్‌గా చూపిస్తుంటారు అని సీతారామన్ చెప్పింది. వస్తువులన్నీ దించడం అయ్యాక డోర్ వద్దకు ట్రంప్, ఆయన భార్య మెలానియా, కూతురు ఇవాంకాలు వచ్చి నిలబడి అందరికీ చేతులు వూపుతూ అభివాదం చేస్తూ మెట్లు దిగారు. వారికి ఘనస్వాగతం పలుకుతూ కేంద్ర మంత్రులు, రాయబారులు పూలబొకేలు ఇచ్చారు. ట్రంప్ అందరితో కరచాలనం చేస్తూనే అటు ఇటు వెదకసాగాడు. రాజ్‌నాథ్‌సింగ్ అది గమనించి... ఏంటి సార్, వెదుకుతున్నారని అడిగాడు. మేరా దోస్త్, మేరా దిల్‌కా దడ్‌కన్ నరేంద్ర మోడీ ఎక్కడ? అని ప్రశ్నించాడు ట్రంప్. ప్రధాని గారు ఏదో అర్జంట్ పని మీద ఇంట్లోనే వున్నారు సార్, మిమ్మల్ని సాదరంగా ఆహ్వానించి తీసుకురమ్మన్నారు అని అమిత్‌షా చెప్పాడు. ట్రంప్ వెంటనే చేతుల్లో వున్న పూలబొకేలను నేలకేసి కొట్టి నేరుగా విమానంలోకి వెళ్లి కూర్చున్నాడు. ఆయన అలా అలిగి వెళ్లిపోవడంతో అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్‌లు షాక్‌కు గురయ్యారు. పరుగెత్తుకుంటూ విమానంలోకి వెళ్లారు. ట్రంప్ కూర్చున్న సీటు వద్దకు వెళ్లి... ఏమైంది సార్, ఎందుకు అలిగారని అడిగారు. మరి నేను వస్తుంటే నన్ను రిసీవ్ చేసుకోవడానికి ఎయిర్‌పోర్టుకు రాడా, ఒక స్నేహితుడికిచ్చే విలువ ఇదేనా, నేను తిరిగి అమెరికాకు పోతున్నా, వెళ్లి మోడీకి చెప్పండని ట్రంప్ బుంగమూతి పెట్టి అన్నాడు. అమిత్‌షా, రాజ్‌నాథ్‌లు ఆయన గడ్డం పట్టుకుని... సార్, మా మోడీకి మీరంటే ప్రాణం, ఆయన ఎయిర్‌పోర్టుకు రాకపోవడానికి ఏదో బలమైన కారణమే వుంటుంది, అదేదో మీరే కనుక్కోండి అని వాళ్లిద్దరూ సముదాయించారు. అప్పుడు ట్రంప్ అలకవీడి విమానం దిగి తన కోసం ఏర్పాటు చేసిన కారెక్కాడు.

కాన్వాయ్ ప్రధానమంత్రి ఇంటి ముందు ఆగింది. డోనాల్డ్ ట్రంప్ కారు దిగాడు. మిగతా వారితో మీరంతా మళ్లీ లోపలకు రండి, నేను ఒక్కడినే లోపలకు వెళ్లి నా ఫ్రెండ్‌ను సర్‌ప్రైజ్ చేస్తాను అని చెప్పాడు. దానికి అందరూ ఓకే అన్నారు. ట్రంప్ సౌండ్ రాకుండా ప్రధాని ఇంటి తలుపు తెరిచాడు. పిల్లిలాగా మెల్లగా అడుగులు వేయసాగాడు. మోడీ హాల్‌లో సోఫాలో కూర్చుని ఎదురుగా వున్న టీవీలో ఏదో చూస్తున్నాడు. ట్రంప్ చల్లగా వెళ్లి మోడీ వెనుకాల నిలబడి తన రెండు చేతులతో ఆయన కళ్లు మూసి... నేనెవరో చెప్పుకో చూద్దాం! అని అన్నాడు. మోడీ కోపంతో... నువ్వెవరివైతే నాకేంట్రా... అవతల మంచి ప్రోగ్రామ్ చూడ్డం మిస్ అవుతున్నా, ముందు చేతులు తీయ్... లేకుంటే పల్లు రాలగొడతానన్నాడు. ఆ మాటలతో ట్రంప్ మరోసారి హర్ట్ అయ్యాడు. మోడీ కళ్ల మీద నుండి చేతులు తీసేసి... ఛఛ... నన్ను ఇన్‌సల్ట్ చేస్తున్నారు, నేను అమెరికాకు పోతున్నాను అని నసిగాడు. అప్పుడు మోడీ వెనక్కి తిరిగి చూశాడు. అక్కడ అలక ముఖం పెట్టి ట్రంప్ వున్నాడు. మోడీ అలర్టై... సారీ ఫ్రెండ్, నువ్వనుకోలేదు, ఎవరో ఆకతాయిల పని అనుకుని తిట్టాను, రా కూర్చో అని ఆహ్వానించాడు. ట్రంప్ శాంతించి... నాకన్నా నీకెక్కువేమొంది... నాకు స్వాగతం పలకడానికి కూడా రాలేదని నిష్ఠూరపోయాడు. అప్పుడు మోడీ... కరెక్ట్‌గా మీ ఫ్లైట్ ల్యాండ్ కాబోయే టైంలోనే టీవీలో ఒక మంచి ప్రోగ్రామ్ అనౌన్స్ చేశారు. ఎయిర్‌పోర్టుకు వస్తే ఈ ప్రోగ్రామ్ మిస్సవుతానేమోనని రాలేదు, ఆ ప్రోగ్రామ్ ఇప్పుడే స్టార్ట్ కాబోతోంది అని చెప్పాడు. ఏం ప్రోగ్రామ్ అది... ఎక్కడెక్కడ ప్రసారమవుతుందని ట్రంప్ అడిగాడు. దానికి మోడీ... ఈ ప్రోగ్రామ్‌ను అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ ఛానెల్స్ అన్నీ ప్రసారం చేస్తాయి. ముఖ్యంగా కామెడీ, కార్టూన్ ఛానెల్స్ అయితే తమ అన్ని కార్యక్రమాలను ఆపుకుని ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తాయని చెప్పాడు. అంతటి ఇంపార్టెంట్ ప్రోగ్రామ్ ఏంటి బ్రో అని ట్రంప్ అడిగాడు. మీకు తెలిసే వుంటుంది... గ్రేట్ గ్లోబల్‌లీడర్ చంద్రబాబునాయుడు గారు.. ఆయన కుమారుడు లోకేష్ ఇప్పుడు ప్రెస్‌మీట్ పెట్టి తమ ఆస్తుల వివరాలు ప్రకటిస్తారు. ప్రతి సంవత్సరం మాకిదొక కామెడీ... సంవత్సరమంతా ఈ సీన్‌లను తలచుకుంటూ టెన్షన్ నుండి రిలీఫ్ అవుతుంటామని మోడీ చెప్పాడు. అప్పుడే టీవీ స్క్రీన్‌పై లోకేష్ ప్రత్యక్షమయ్యాడు. తమ ఆస్తుల వివరాలు ప్రకటించసాగాడు. ఈ సంవత్సరం అమ్మ పాలు అమ్మగా వచ్చిన ఆదాయం 125కోట్లు, అమరావతికి అమ్మ దానం చేసిన గాజుల విలువ పాతిక కోట్లు, కూరగాయలు అమ్మగా బ్రాహ్మణి పేరుతో వచ్చిన సంపాదన 90కోట్లు, ఇందులో అందరికీ కలిపి తిండి ఖర్చులు 80కోట్లు పోను మిగులు 10కోట్లు, నారా చంద్రబాబునాయుడు ఆస్తి 4కోట్లు, నారా దేవాన్ష్ కష్టపడి సంపాదించిన ఆస్తి 57కోట్లు... ఇవికాక ఇంట్లో రెండు డబుల్‌కాట్ మంచాలు, రెండు పరుపులు, నాలుగు దిండ్లు, ఐదు కంచాలు, 4 సీలింగ్ ఫ్యాన్లు, ఒక సెకండ్ హ్యాండ్ ఏ.సి, 1980 మోడల్ బజాజ్ చేతక్ స్కూటర్ ఒకటి, నాలుగు దబర్లు, రెండు బకెట్లు, 10 టీగ్లాసులు, ఒక స్టౌ, రెండు హెచ్‌పి సిలిండర్లు, నాకు నాలుగు ఫ్యాంట్లు, ఆరు చొక్కాలు, రెండు రామ్‌రాజ్ కంపెనీ బనియన్‌లు... అని చెప్పుకుంటూ పోతున్నాడు. అదంతా చూస్తున్న ట్రంప్... ఏమిటీ లెక్కల భాగోతం అని ప్రశ్నించాడు. ఇది ఇండియా, ఇక్కడ జరగని మిరాకిల్స్ వుండవు. 40ఏళ్ల రాజకీయ అనుభవం, పదవులు అనుభవించిన చంద్రబాబునాయుడు పేరుతో చిల్లిగవ్వ ఆస్తి లేదు... ఇంకా పాలు మరవని పసిబిడ్డ దేవాన్ష్ మాత్రం 57కోట్ల ఆస్తి సంపాదించాడు. ఇలాంటి కామెడీ మీ అమెరికాలో సాధ్యమవుతుందా అని మోడీ ప్రశ్నించాడు. అందుకు ట్రంప్... ఇలాంటివి సాధ్యం కావాలంటే మాకూ ఓ చంద్రబాబు కావాలి, అందుకే ఆయన్ను గ్లోబల్ లీడర్ అనేది అంటూ అక్కడ నుండి లేచాడు.





సంతోష్ - అనూష

కలైమామణి, సంగీత సామ్రాట్ డా. సాలూరి రాజేశ్వరరావు మనుమడు, ప్రముఖ సంగీత దర్శకుడు సాలూరి వాసూరావు - మంజరిరావుల కుమారుడు **సంతోష్ మునీష్ - అనూష** (నెల్లూరు వాస్తవ్యులు విన్నకోట వెంకటేశ్వరరావు - లక్ష్మిల కుమార్తె)ల కళ్యాణం ఫిబ్రవరి 26వ తేదీ నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్ నందు వైభవంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు సినీ నేపథ్య గాయకులు పద్మభూషణ్ ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యంతో పాటు సినీ సంగీత ప్రపంచానికి సంబంధించిన మాధవపెద్ది సురేష్, కోటి, మణిశర్మ, శివమణి, నటుడు భానుచందర్, ఇంకా పలువురు సినీ, రాజకీయ, రంగ, వ్యాపార ప్రముఖులు విచ్చేసి వధూవరులను దీవించారు. కొత్త జంటకు 'లాయర్' శుభాభినందనలు.

## వైభవంగా డా.కిషోర్స్ రత్నం స్కూల్స్ వార్షికోత్సవ వేడుకలు



నెల్లూరులోని డా.కిషోర్స్ రత్నం పాఠశాలల 5 రోజుల వార్షిక వేడుకలు ఈనెల 22వ తేదీ నుండి 26వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరిగాయి. కస్తూర్బా కళాక్షేత్రం వేదికగా నిర్వహించిన ఈ వేడుకలలో డా.కిషోర్స్ రత్నం గ్లోబల్ స్కూల్, రత్నం హైస్కూల్ (వేదాయపాళెం), రత్నం తీర్థస్కూల్ విద్యార్థులు తమ అరుదైన ప్రతిభతో అలరించారు. తొలిరోజు స్కూల్ డైరెక్టర్లు డా.కె.కృష్ణకిషోర్, వాసంతి కిషోర్ పాల్గొని జ్యోతిప్రజ్వలనం చేసి వేడుకలను ప్రారంభించారు. ఆనంద విహారి, అద్వితీయం, మధురిమలు, పదనిసలు వంటి పేర్లతో నిర్వహించిన వేడుకలు ఆద్యంతం అలరించాయి. ప్రతిరోజూ ప్లేక్లాస్ నుండి 10వ తరగతి వరకు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాల జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడుతో పాటు మేనేజర్లు, ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.



## ఎన్టీఆర్ ఇళ్ళను పరిశీలించిన మనుక్రాంత్

జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి చెన్నారెడ్డి మనుక్రాంత్ 26వ తేదీ నెల్లూరు వెంకటేశ్వరపురం, జనార్ధన్‌రెడ్డి కాలనీలలో "హౌస్ ఫర్ ఆల్" స్కీం క్రింద నిర్మించిన ఎన్టీఆర్ ఇళ్ళను పరిశీలించాడు. ఈ సందర్భంగా మనుక్రాంత్ మాట్లాడుతూ వేలకోట్ల రూపాయలతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్మించిన ఈ గృహాలు నిరుపయోగంగా వున్నాయని, వెంటనే వాటిని లబ్దిదారులకు అందజేయాలన్నాడు. ఎంతో మంది పేదలు తమకున్న చిన్నచిన్న వస్తువులు తాకట్టుపెట్టి, ఈ ఇళ్ళ కోసం అడ్వాన్సులు కట్టి వున్నారని, అలాంటివారి కష్టాలను దృష్టిలో పెట్టుకుని అర్హులైన పేదలకు ఇళ్ళను అందజేయాలని కోరాడు. ఈ విషయాన్ని త్వరలో జిల్లా కలెక్టర్‌ను కలిసి వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జనసేన నాయకులు పసుమర్తి కిషోర్, డాక్టర్ అజయ్, అంకిత్, మొయిన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## మాడరన్ సైఫారీ ఫీస్ట్



నెల్లూరు సరస్వతినగర్‌లోని మాడరన్ స్కూల్‌లో ఈనెల 23న ఏర్పాటు చేసిన సైఫారీ ఫీస్ట్ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. కొత్త రకం ఎక్స్ పర్ మెంట్స్, పురాతన కట్టడాలు, డ్యామ్‌లు, కోనార్క్ దేవాలయాల నమూనాలు, ఢిల్లీ జంతర్‌మంతర్, ఓడ రేవు, టైటానిక్ షిప్, ఎయిర్ పోర్ట్, లోటస్ టెంపుల్, మల్టీ స్టోరడ్ అపార్ట్‌మెంట్స్, మేజర్ ఇండస్ట్రీస్ లాంటి వివిధ రకాల నమూనాలు ఈ ప్రదర్శనలో వుంచారు. ఇటీవల పాబోలు శారదామణి గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్ సాధించిన గిఫ్ట్ ఆర్టికల్స్ తో ఆమె ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ ప్రదర్శన ముఖ్య ఉద్దేశ్యం ఈ తరం పిల్లలకు కొన్ని అరుదైన సైన్స్ పరికరాలు, పురాతన కట్టడాలు వాటి విశిష్టతలను తెలియజెప్పడం, అచ్చం అలాగే ఉండే నమూనాలను చూపించి వారికి వివరించి వాటి విశిష్టతను తెలియజేయడం ద్వారా ప్రత్యక్షంగా చూసే అనుభూతిని కలిగించడం లాంటివి విద్యార్థినీ విద్యార్థులకు ఎంతో ఆనందాన్ని కలిగించాయి. స్కూల్ కరస్పాండెంట్ వాకాటి విజయకుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ కవిత పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## డిపిఐసి ఛైర్మెన్‌గా కలెక్టర్!

నవరత్నాలలో ఒక రత్నమైన 'నాడు - నేడు' అమలును పర్యవేక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. డిస్ట్రిక్ట్ ప్లానింగ్ అండ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ(డిపిఐసి)కి ఛైర్మెన్‌గా జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు వ్యవహరిస్తారు. అలాగే కన్వీనర్‌గా జాయింట్ కలెక్టర్ వినోద్‌కుమార్ వుంటాడు. నుడా వైస్‌ఛైర్మెన్, మున్సిపల్ కమిషన్, ఎన్‌బిసిసి ప్రతినిధి ఈ కమిటీలో సభ్యులుగా వుంటారు.



## సెమిస్టర్ ఫలితాల్లో.. బీజీఆర్ విద్యార్థినుల ప్రభంజనం

విక్రమ సింహపురి యూనివర్శిటీ విడుదల చేసిన 5 వ సెమిస్టర్ డిగ్రీ ఫలితాల్లో బెజవాడ గోపాల్ రెడ్డి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు 94 శాతం ఉత్తీర్ణత సాధించి విజయకేతనం ఎగురవేశారని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జేవీ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను అభినందించారు. అంకితభావం గల అధ్యాపకులు, క్రమశిక్షణ గలిగిన విద్యార్థినుల వలన మంచి ఫలితాలను సాధించగలిగామని ప్రిన్సిపల్ వి.మృదుల అన్నారు. బీయస్సీ మైక్రోబయాలజీ, కెమిస్ట్రీ, బయో కెమిస్ట్రీ విభాగంలో టి.శార్వాణి 9.79, యమ్‌యస్ శరణ్య 9.59, యన్.నిఖిత 9.57, బి.సాయినవ్య 9.47, ఎస్ కె షామిరా సుల్తానా 9.04, డి.విజయచంద్రిక 9.03, ఇ.సుష్మ 9.01, బీఎస్సీ బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగంలో యం.మౌనిక 9.61, ఎన్ కె మంజూర్ 9.31, ఎన్ కె సుమయ తబసుం 9.29, ఎన్ శ్రీ ప్రవల్లిక 9.24, వి. శ్రీలేఖ 9.09, బీయస్సీ మ్యాథమాటిక్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్ విభాగంలో పి.సుమయ 9.41, డి.నవ్య 9.35 జీపీఏలు సాధించారు.




ఈ నెల 26వ తేదీ ముంబైలోని హోటల్ సహారాలో జరిగిన కార్యక్రమంలో ఎడ్యుకేషనల్ వరల్డ్ సంస్థ సిఇఓ సుమిత్ నుండి 'స్పెషల్ మెరిట్ అవార్డ్ ఇన్ ఎమర్జింగ్ స్కూల్' అవార్డును అందుకుంటున్న గూడూరు, ఎల్‌ఏపి స్కూల్ కరస్పాండెంట్ బి.శ్రీకాంత్‌రెడ్డి

## మహాశివరాత్రి పురస్కారాలు ప్రదానం



సింహపురి సంస్కృతి సమాఖ్య వ్యవస్థాపకులు రాంజీ ఆధ్వర్యంలో ఈనెల 25న నెల్లూరు టౌన్‌హాలులో విభిన్న రంగాల్లో ప్రతిభావంతులకు మహాశివరాత్రి పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విశ్రాంత కలెక్టర్ బి.లక్ష్మీకాంతం దంపతులను సంస్కృతి సమాఖ్య ఆధ్వర్యంలో సత్కరించారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీనునాయక్, ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్, నలుబోలు బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

# చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి



## - భవన క్రమబద్ధీకరణపై కమిషనర్ పివివిస్ మూర్తి

నగరపాలక సంస్థ ప్రణాళికా నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాల క్రమబద్ధీకరణకు చివరి అవకాశాన్ని కల్పిస్తున్నామని, అక్రమ నిర్మాణాలు చేపట్టిన భవనాల యజమానులు ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పివివిఎస్ మూర్తి సూచించారు. నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రణాళిక విభాగం నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం తేది31-08-2018న బి.పి.ఎస్ పథకాన్ని ప్రారంభించి, ఆ తేదీ నాటికి జరిగిన నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపిందని తెలిపారు. దాని ప్రకారంగా 2019 జనవరి నెలలో 1710 అక్రమ నిర్మాణాలను గుర్తించి, భవన యజమానులకు నోటీసులు జారీ చేశామని వెల్లడించారు. పూర్తి వివరాలు, ధ్రువీకరణ పత్రాలు అందజేసిన వెయ్యిమంది నిర్మాణాలను క్రమబద్ధీకరించామని, మరో 290 దరఖాస్తుల దస్త్రాలు పరిశీలించి క్రమబద్ధీకరణకై చెల్లించాల్సిన రుసుము వివరాలను తెలియజేశామని పేర్కొన్నారు. అదేవిధంగా మరో 130 దరఖాస్తుల వివరాలను టౌన్‌ప్లానింగ్ విభాగం సిబ్బంది సిద్ధం చేస్తున్నారని, బుధవారం జాబితాను సిద్ధంచేసి వారందరికీ రుసుము వివరాలు తెలియపరుస్తామని కమిషనర్ వివరించారు. మరో 300వరకూ ఉన్న దరఖాస్తులకు సంబంధించి దస్త్రాలు ఏవీ ఇప్పటి వరకు కార్యాలయానికి అందజేయనందున వారికి చివరి అవకాశంగా పత్రాలందించేందుకు రెండు రోజుల కాలపరిమితి విధించామని కమిషనర్ చెప్పారు. ఈనెల 29వ తేదీతో పథకం ముగుస్తున్నందున భవన యజమానులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈనెల 28వతేదీ లోపు సూచించిన రుసుము మొత్తాన్ని కార్యాలయంలో చెల్లించి, వారి నిర్మాణాలను క్రమబద్ధీకరించుకోవాలని, సమయం దాటిన తర్వాత ఆన్‌లైన్ విధానం పని చేయదని కమిషనర్ సూచించారు. ఈ సమావేశంలో డిసిపి ప్రసాద్ పాల్గొన్నారు.

# నిమ్మగడ్డపై వున్న ప్రేమ.. తెలుగుగడ్డపై లేదేం..?

## - కోటంరెడ్డి శీనయ్య



సెర్బియాలో అరెస్టయిన పారిశ్రామికవేత్త నిమ్మగడ్డ ప్రసాద్‌ను విడిపించాలని వైసిపి నాయకులు కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసి ప్రాధేయపడ్డారని, నిమ్మగడ్డపై చూపిన ప్రేమను వీళ్ళు సొంతగడ్డపై చూపడంలేదని నుడా మాజీఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆరోపించాడు. 25వ తేదీ నెల్లూరులోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి ఎంపీలు నిమ్మగడ్డ ప్రసాద్‌ను విడిపించాలని అమిత్‌షాను కలిసి కోరారు తప్పితే, అదేనోటితో రాష్ట్రానికి ప్రత్యేకహోదా కావాలని ఒక్కరన్నా అడిగారా అని ప్రశ్నించారు. అవినీతిపై సీఎం జగన్ మాట్లాడడం కామెడీగా వుందని, తనపై 42వేల కోట్ల ఆర్థిక నేరాలకు సంబంధించిన కేసుల గురించి ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఈ కేసుల విచారణ జరిగితే జగన్ జైలుకెళ్లడం ఖాయమన్నాడు. తన అవినీతి అక్రమాలను ప్రశ్నిస్తున్న టీడీపీ నేతలను ఇబ్బంది పెట్టడానికే జగన్మోహన్‌రెడ్డి 'సిట్' పేరుతో కొత్త నాటకానికి తెరతీశాడన్నాడు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు పిట్టి సత్యనాగేశ్వరరావు, ఉచ్చి భువనేశ్వరప్రసాద్, ఆకుల హనుమంతురావు, పసుపులేటి మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

# స్నేహమంటే ఇదేరా!

(మొదటి పేజీ తరువాయి)

సందర్శించడం తన జీవితంలో మరపురాని సందర్భంగా పేర్కొన్నారు. అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టు నుండి సబర్మతి ఆశ్రమం వరకు 22కిలోమీటర్ల మేర దారి పొడవునా లక్షలాది మంది ప్రజలు భారత్, అమెరికా జాతీయ పతాకాలను చేబూని స్వాగతం పలకడం ట్రంప్ జీవితంలో మరపురాని అనుభూతిగా పేర్కొనవచ్చు.

### సగటు భారత రాజకీయ నాయకుడిలానే...

గత ఏడాది భారత ప్రధాని నరేంద్ర మోడీ అమెరికాలో పర్యటించినప్పుడు టెక్సాస్‌లో నిర్వహించిన 'హౌడీ మోడీ' సభ ఎంతో విజయవంతమైంది. ఈ సభలో మోడీతో పాటు అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ కూడా పాల్గొనడం తెలిసిందే!

ఇప్పుడు ట్రంప్ భారత పర్యటనలోనూ అదే రీతిలో 'నమస్తే ట్రంప్' పేరుతో అహ్మదాబాద్‌లోని మొతేరా క్రికెట్ స్టేడియంలో నిర్వహించిన సభ ట్రంప్‌కు నీరాజనం పట్టింది. లక్షలాది మంది ప్రజల హర్షధ్వానాల మధ్య ట్రంప్ చేసిన ప్రసంగం సగటు భారత రాజకీయ నాయకుడిని తలపించింది. ట్రంప్ తన ప్రసంగంలో మోడీ పని తీరును ఆకాశానికెత్తడంతో పాటు, ప్రపంచ నేతగా ఆయనను అభివర్ణించడం అగ్రరాజ్యం భారత్‌కు ఇస్తున్న ప్రాధాన్యతకు అద్దం పడుతోంది. భారతీయతను స్ఫురిస్తూ మహాత్మాగాంధీ, స్వామి వివేకానంద వంటి మహనీయులను స్మరిస్తూ, సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లి వంటి క్రికెట్ వీరులను స్తుతిస్తూ, షోలే, దిల్‌వాలే దుల్హనియా లేజాయేంగే వంటి సినిమా పేర్లను ప్రస్తావిస్తూ ట్రంప్ అరగంటపాటు చేసిన ప్రసంగం స్టేడియంలో ప్రత్యక్షంగా చూస్తున్న లక్షలాదిమంది, టీవీల ద్వారా చూస్తున్న కోట్లాదిమంది భారతీయులను ఆకట్టుకుంది.

మొదటిరోజు పర్యటనలో ఆగ్రా వెళ్లి ట్రంప్ కుటుంబసభ్యులు తాజ్‌మహల్‌ను సందర్శించడం, 25వ తేదీ రెండోరోజు ఢిల్లీలో మహాత్ముడి ఘాట్ వద్దకు వెళ్లి నివాళులర్పించడం, రాష్ట్రపతి భవన్‌లో జరిగిన విందుకు హాజరవడం వంటివి సాధారణ కార్యక్రమాలే అయినా ఇరు దేశాల మధ్య ఎన్నో ఒప్పందాలకు ఈ పర్యటన ద్వారా శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా ఇరు దేశాల మధ్య అధునాతన ఆయుధాల కొనుగోలుపై 21,500కోట్లకు ఒప్పందాలు కుదిరాయి.

### సిఏఏపై కేంద్రంకే ఓటు

దేశంలో కొంతకాలంగా ఆందోళనలు చేస్తున్న సిఏఏ బిల్లు విషయంపై ట్రంప్ తన వైఖరిని కుండబద్ధలు కొట్టినట్లు చెప్పారు. దానిని భారత అంతర్గత విషయంగా తేల్చిచెప్పారు. మత స్వేచ్ఛ విషయంలోనూ ఆయన మోడీ ప్రభుత్వానికి బాసటగా నిలిచారు. ఒక్క కాశ్మీర్ అంశంలో మాత్రం ఆయన భారత్‌ను ఇబ్బంది పెట్టాడు. తనకు పాకిస్థాన్ అధ్యక్షుడు నవాజ్‌షరీఫ్ కూడా మంచి స్నేహితుడేనని, ఇరు దేశాలు కోరితే మధ్యవర్తిత్వానికి సిద్ధమంటూ భారత్‌కు రుచించని ఒక ప్రకటన మాత్రం చేశారు.

మొత్తంగా చూస్తే ట్రంప్ పర్యటన ద్వారా భారత్ పట్ల అగ్రరాజ్యం వైఖరి వెల్లడైంది. ముఖ్యంగా ఇస్లామిక్ ఉగ్రవాదాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించిన ట్రంప్, ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విషయంలో భారత్‌కు దన్నుగా నిలవాలనే ధృఢ సంకల్పం ఆ దేశంలో కనిపిస్తోంది.

ప్రపంచంలో రెండు పెద్ద దేశాలు చైనా, భారత్‌లు. ఈ రెండూ ఆసియా ఖండం దేశాలే! అమెరికా అగ్రరాజ్యం పట్టును నిలుపుకోవాలంటే ఆసియా ఖండంపై పట్టు సాధించాలి. ప్రపంచంలో అమెరికాకు ధీటుగా చైనా ఎదుగుతోంది. అమెరికాకు ఎప్పటికైనా ముప్పు చైనాతోనే! ఆసియా ఖండంలో చైనాను అన్ని విధాలా ఎదుర్కోగల శక్తిగా భారత్ తయారుకావాలి. భారత్ నమ్మదగిన దేశం. ఈ లక్ష్యంతోనే అమెరికా, భారత్‌తో బలమైన బంధానికి బాటలు వేసుకుంటోంది.



## నేత్రపర్వం...

# మూలస్థానేశ్వరస్వామి బ్రహ్మోత్సవం

నెల్లూరు మూలాపేటలో స్వయంభువుగా వెలసియున్న శ్రీ భువనేశ్వరీ సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈనెల16 నుండి 28వరకు వైభవంగా జరిగాయి. 16వతేది అంకురార్పణతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు 17న ఉదయం ధ్వజారోహణ, రాత్రి సింహవాహనం, 18న చప్పర ఉత్సవం, పురుషామృగవాహనం, 19న చప్పర ఉత్సవం, శేష వాహనం, 20న చప్పర ఉత్సవం, రాత్రి వెండినందిసేవ తదితర కార్యక్రమాలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. 21 వ తేది మహాశివరాత్రి సందర్భంగా స్వామి అమ్మవార్లకు పూలంగిసేవ, పాలాభిషేకం, గిన్నెభిక్ష, లింగోద్భవాభిషేకం, వెండినందిసేవ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. తెల్లవారుజామునుండి భక్తులు వేలాదిగా పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. 22న రాత్రి స్వామి వారి కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. అనంతరం గజవాహనసేవలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. 23వ తేది ఉదయం స్వామివారి రథోత్సవం అంగరంగవైభవంగా జరిగింది. రాష్ట్ర మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి రథాన్ని లాగారు. వేలాదిగా భక్తజనం రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. 24న ఉదయం చప్పర ఉత్సవం, రాత్రి పులివాహన సేవ, 25న చప్పర ఉత్సవం రాత్రి అలకలతోపు, 26న ఉదయం తీర్థవాది, రాత్రి ధ్వజావరోహణ, తిరిచ్చి ఉత్సవం, 27న ఉదయం దవనోత్సవం, 28న ఉదయం ఏకాంతసేవ కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగిసాయి. ప్రతిరోజు సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ ఛైర్మన్ లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఇఓ ఎ.వేణుగోపాల్, ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షించారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## శబరి శ్రీరామక్షేత్రం..

# తొలి పాలకమండలి

నెల్లూరు, దుర్గామిట్టలోని శబరి శ్రీరామక్షేత్రంకు రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా పాలకమండలిని నియమించింది. పాలకమండలి ఛైర్మెన్‌గా పిడూరు కిషోర్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. అలాగే సభ్యులుగా తుమ్మల శ్రీనివాసరావు, మిద్దె శ్రీనాథ్‌యాదవ్, గుడిపాటి వెంకటేశ్వర్లు, వడ్లమూడి వెంకటసుబ్బమ్మ, దద్దోలు సుజాత, ఎస్.సుబ్బలక్ష్మిలను నియమించారు. అలాగే ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఆలయ అర్చకులు వేదాంతం సత్యనరేష్‌ను నియమించారు.

శబరి శ్రీరామక్షేత్రంకు వందల ఏళ్ల చరిత్ర వున్నప్పటికీ గత 20ఏళ్ల నుండే ఈ దేవాలయం బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ప్రముఖ వ్యాపారవేత్త చెన్నూరు వెంకటేశ్వరరెడ్డితో పాటు మరెందరో వదాన్యులు ఈ క్షేత్రం అభివృద్ధికి కృషి చేశారు. ప్రతిఏటా చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి సారధ్యంలోనే శ్రీరామనవమి ఉత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతుండేవి. శబరి శ్రీరామక్షేత్రం దేవాదాయశాఖ పరిధిలోకి వచ్చి చాలాకాలమే అయినా ఇంతకాలం కూడా పాలకమండలిలను ఏర్పాటు చేయలేదు. చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి, ఆయన మిత్రులు, కొందరు శాశ్వత భక్తులే ఈ దేవస్థానం కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ వచ్చారు. ఎట్టకేలకు ఇప్పుడు స్థానిక ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చొరవతో పాలకమండలి నియామకం జరిగింది.

# విశేష 'స్పందన'

నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఈనెల24న జరిగిన స్పందన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుండి 115 మంది పాల్గొని తమ సమస్యలను వినతులరూపంలో ఏఎస్పీ(క్రైమ్స్) మనోహర్‌రావుకు అందజేశారు. వీటిని పరిశీలించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ఎస్పీ భాస్కర్‌భూషణ్ తన క్యాంపు కార్యాలయం నుండి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా స్పందన కార్యక్రమాన్ని పరిశీలించారు. పలు ఫిర్యాదులపై ఆయన సిబ్బందికి తగు సూచనలు చేశారు. మహిళలు, చిన్నారుల సమస్యలపై కఠినంగా వ్యవహరించాలని, దంపతుల కేసుల్లో తొలుత కౌన్సిలింగ్ నిర్వహించాలని, సమస్య పరిష్కారం కాని పక్షంలో కేసులు నమోదు చేయాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసేవారిపై తగుచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నెల్లూరునగర, రూరల్, ఎస్బీ, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీలు శ్రీనివాసులురెడ్డి, రాఘవరెడ్డి, కోటారెడ్డి, నాగరాజు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శంభో శంకర!.. హరహర మహాదేవ!..



- **శివ నామస్మరణతో విశాఖ తీరాన్ని హోరెత్తించిన సుబ్బరామిరెడ్డి**
- **పరమశివునికి మహా కుంభాభిషేకం**
- **తరలివచ్చిన రాజకీయ, సినీరంగాల ప్రముఖులు**

మహా శివరాత్రి పర్వదినం రోజున విశాఖ సాగరతీరం జనసముద్రమైంది. జిల్లా నలుమూలల నుంచి భక్తులు లక్షల సంఖ్యలో తరలివచ్చి ఎంతో భక్తిశ్రద్ధలతో సముద్రతీరంలో స్నానాలాచరించి, సాగరతీరంలో టి.సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న పరమశివుని మహాకుంభాభిషేకాన్ని కన్నులారా దర్శించుకుని తరించారు. ఈ సందర్భంగా 'శంభో హరహర మహాదేవ' అంటూ పెద్దపెట్టున శివ మంత్రోచ్ఛరణతో టిఎస్సార్ చేసిన శివనామ స్మరణతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లిపోయింది. భక్తులంతా మంత్రముగ్ధులై ఈ అద్వితీయమైన వేడుకను తిలకించి పులకించిపోయారు.





ప్రతి ఏడాది లాగానే ఈసారి కూడా విశాఖ సాగరతీరంలో పరమశివుని మహాకుంభాభిషేకం అత్యంత వైభవోపేతంగా జరిగింది. రాజ్యసభ సభ్యుడు, పరమశివుని భక్తుడు టి.సుబ్బరామిరెడ్డి నేతృత్వంలో వేదపండితుల మంత్రోచ్ఛాటనల మధ్య, మంగళవాయిద్యాల మధ్య సముద్రతీరంలో కోటిలింగాలకు కుంభాభిషేక మహోత్సవం, యాగం నేత్రపర్వంగా సాగాయి. శారదా పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ పాల్గొని కోటిలింగాలకు ప్రత్యేకపూజలు నిర్వహించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుబ్బరామిరెడ్డి ఎంతో భక్తిప్రపత్తులతో పరమశివుడికి పంచామృతాలతో మహాకుంభాభిషేకం నిర్వహించడమే కాకుండా, అక్కడికి విచ్చేసిన లక్షలాదిమంది ప్రజలకు బిందెలతో దైవప్రసాదమైన ఆ పంచామృతాలు పంచిపెట్టారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా అలాగే నిలబడి స్వామివారికి స్వయంగా.. అత్యంత వైభవంగా ఆయన అభిషేకాలు చేయించడం చూసి విశాఖ ప్రజలు టిఎస్సార్ భక్తికి పరమానందం చెందారు.




### భక్తులను విశేషంగా ఆకట్టుకున్న టిఎస్సార్ శివనామ స్మరణలు :

చేతిలో ఢమరుకాన్ని మోగిస్తూ, శివ భక్తిని చాటే అనేకమైన సంస్కృత శ్లోకాలను అలవోకగా.. అనర్ఘళంగా ధారాపాతంగా చెప్తూ, శివ మంత్రోచ్ఛరణ చేస్తూ టిఎస్సార్ ఈ సందర్భంగా దాదాపు 30నిమిషాల పాటు చేసిన శివనామ స్మరణలు, శివ స్తోత్రాలు భక్తులను బాగా ఆకట్టుకున్నాయి. ఇప్పుడే కాదు, గత 30 సంవత్సరాలుగా ఇదేవిధంగా టిఎస్సార్ పరమశివుని పట్ల ఎంతో భక్తితో చేస్తున్న ఈ మహాకుంభాభిషేకాల్లో తమకు కూడా పాల్గొనే అవకాశం కల్పించడం పట్ల విశాఖ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

అనంతరం టిఎస్సార్ మాట్లాడుతూ, గత 30 ఏళ్ళుగా ఇదేవిధంగా ప్రతిఏటా శివరాత్రి పుణ్యదినం రోజున ఆ దేవదేవునికి మహాకుంభాభిషేకాలు నిర్వహించి ఈ దైవకార్యం ద్వారా విశాఖ ప్రజలకు అశేష భక్తజనులకు ఆధ్యాత్మికత భక్తిభావాలను, పుణ్యాన్ని పంచుతున్నానని భక్తుల కరతాళధ్వనుల మధ్య అన్నారు. రాజకీయాలకు అతీతంగా, పరమభక్తితో ఆ పరమేశ్వరుని పూజిస్తూ ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నానని చెప్పారు. శివుని అనుగ్రహంతో ప్రతిఒక్కరి జీవితం సార్థకం కావాలని ఆకాంక్షిస్తున్నానని, అందుకు ప్రతిఒక్కరూ శివ నామస్మరణతో తమ జీవితాలను సార్థకం చేసుకోవాలని అన్నారు. ఎవరి జీవితమైనా సార్థకం కావాలంటే అది శివ నామస్మరణ వల్లే సాధ్యమవుతుందన్నారు. తన వారసత్వంగా భవిష్యత్తులో తన మనవడు రాజీవ్‌రెడ్డి ఈ దైవకార్యాలను కొనసాగిస్తాడని టిఎస్సార్ అంటూ, ఆ మేరకు రాజీవ్ రెడ్డితో ప్రమాణం చేయించారు. అనంతరం, శ్రీ శారదా పీఠం ఉత్తర పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీని టిఎస్సార్ ఘనంగా సత్కరించారు.

### ఇదెంతో గొప్ప విషయం - శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ

ఈ మహాకుంభాభిషేక మహోత్సవాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీ శారదా పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ మాట్లాడుతూ విశాఖ సాగరతీరంలో ప్రతిఏటా పరమశివునికి ఇలా మహాకుంభాభిషేకాలు అత్యంత వైభవంగా జరగడం ఎంతో గొప్ప విషయమని, దేశంలో మరెక్కడా జరగనంత వైభవంగా టిఎస్సార్ ఈ ఉత్సవాలను విశాఖలో ఎంతో శోభాయమానంగా నిర్వహించడం సంతోషకరమని, ఇలాంటి కార్యక్రమాలు భక్తుల్లో ఆధ్యాత్మిక భక్తిభావాలు వెల్లివిరిసేందుకు ఎంతగానో దోహదం చేస్తాయని చెప్తూ స్వామీజీ ఈ సందర్భంగా టిఎస్సార్‌ను అభినందించారు. తానెక్కడా ఇంత సమయాన్ని వెచ్చించింది లేదని, కానీ ఈ కార్యక్రమం కోసం ఎంత సమయమైనా సరే.. వేచి ఉండాలనిపిస్తోందని, ఇక్కడ భగవంతుని దర్శనంతో పాటు, భక్తుల దర్శనం కూడా తనకు లభిస్తోందన్నారు. ఇలాంటి కుంభాభిషేకాలు నిర్వహించడానికి కేవలం ధనం ఉంటే చాలదని, అందుకు తగ్గట్టుగా భక్తి, మానసిక ధైర్యం, తపస్సు ఉండాలని, ఇవన్నీ సుబ్బరామరెడ్డిలో పుష్కలంగా ఉన్నాయని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభను తొలుత స్వామీజీ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం స్వామీజీ మాట్లాడుతూ గత 30 ఏళ్ళుగా శివరాత్రి పర్వదినాన ఎంతో భక్తితో ఆ పరమేశ్వరునికి పూజలు చేసి తరిస్తున్న సుబ్బరామిరెడ్డికి, ఈ వేడుకల్లో పాల్గొన్న విశాఖ ప్రజలందరికీ కూడా ఇదొక మహద్భాగ్యమని అంటూ అందరికీ ఆశీస్సులందజేశారు.

### రాజకీయ, సినీ దిగ్గజాలతో కళకళలాడిన విశాఖ తీరం

ఈ మహాకుంభాభిషేక వేడుకలకు దేశంలోని ప్రముఖ రాజకీయ నాయకులు, సినీప్రముఖులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో విశాఖ తీరం కళకళలాడింది. ప్రముఖ సినీనటుడు మురళీమోహన్ మాట్లాడుతూ టిఎస్సార్ ఏళ్ళ తరబడి రాజకీయాల్లో ఉన్నా ఆయన అజాతశత్రువని కొనియాడారు. శివుడి మాదిరిగానే టిఎస్సార్ కూడా భోళాశంకరుడని, మిత్రులకే కాకుండా శత్రువులకు కూడా సాయం చేసే గొప్ప వ్యక్తిత్వం టిఎస్సార్‌దని ప్రశంసించారు. ప్రఖ్యాత గాయని పి.సుశీల, ప్రముఖ సినీనటీమణులు కళాభినేత్రి వాణిశ్రీ, మీనా, కవిత, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ద్రోణంరాజు శ్రీనివాసరావు, రాధాకృష్ణరాజు, కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలు రమణికుమారి, తెలంగాణ సీనియర్ నాయకుడు పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ వేడుకల సందర్భంగా ఆధ్మాత్మిక (sic) వేదికపై ప్రముఖ కళాకారులు బెంగుళూరుకు చెందిన ప్రభాత్ కళవిదరు బృందం వారు నిర్వహించిన 'విజయనగర విజయం', 'శ్రీరామ పట్టాభిషేకం' నృత్యరూపకాల ప్రదర్శనలు, శృతి సామ్నవి శాస్త్రీయ నృత్యాలు, బిఏ నారాయణ ఆధ్యాత్మిక బృందం వారి భక్తిగీతాలు, ప్రముఖ కళాకారుడు గుమ్మడి గోపాలకృష్ణ పద్యపఠనం భక్తులను బాగా ఆకట్టుకున్నాయి.





Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com